సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 22 । జనవరి । 2023



బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యలక్ష్మి సూచించారు. IIలో



వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా కోరారు. IIలో

ఉధృతంగా పొగమంచు



సాక్షి,పాడేరు: ఏజెన్సీలో పొగమంచు తీవ్రత నెలకొంది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.పాడేరు మండలం మినుములూరులో 12డిగ్రీలు, చింతపల్లిలో 15.5డిగ్రీలు, అరకులోయలో 15.7డిగ్రీలు నమోదయ్యాయి. చలిగాలులు తగ్గాయి.

ఇతర దేశాలతో భారత్‌కు సత్సంబంధాలు

- అరకు ఎంపీ మాధవి



సమావేశంలో పాల్గొన్న ఎంపీ మాధవి

కొయ్యూరు: భారత్ అనేక దేశాలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ మంచి విదేశాంగ విధానాన్ని అవలంభిస్తోందని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. శనివారం రాజస్తాన్ జోధ్‌పూర్‌లో నిర్వహించిన విదేశీ వ్యవహారాల కమిటీ స్టడీ టూర్ సమావేశంలో పాల్గొన్న ఆమె అక్కడి నుంచి ఫోన్లో మాట్లాడారు. దేశాన్ని ఆనుకుని ఉండి సరిహద్దును పంచుకుంటున్న కొన్ని దేశాలు భారత్‌కు వ్యతిరేకంగా ఉన్నా మిగతా దేశాలు మన దేశంతో స్నేహం చేసేందుకు ముందుకు వస్తున్నాయని చెప్పారు. భారత్ అనుసరించాల్సిన మెరుగైన విదేశాంగ విధానంపై అనేక మంది సూచనలు చేశారని ఆమె పేర్కొన్నారు.

50 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యం

- మార్కెటింగ్, సహకారశాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి



మాట్లాడుతున్న చిరంజీవి చౌదరి, పక్కన కలెక్టర్ సుమిత్‌కుమార్, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : జిల్లాలో 50 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని మార్కెటింగ్, సహకారశాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి తెలిపారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అన్ని రకాల తోడ్పాటు అందిస్తామని చెప్పారు. భూమి, రుణాల మంజూరులో ఏమైన సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే వెంటనే తిరిగి పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రాజెక్ట్ రిపోర్టులతో ముందుకు వస్తే బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రిసోర్స్‌పర్సన్లను గుర్తించి వారి ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం తక్కువగా ఎరువుల వినియోగించి ఎక్కువగా ఆర్గానిక్ పంటలు పండిస్తున్నారని భవిష్యత్తులో కూడా ఇదే పద్ధతి కొనసాగించాలన్నారు. ప్రతి పంటకు శాస్త్రవేత్తల సహకారం తీసుకోవాలని సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ పథకం ద్వారా, ఎఫ్‌పీవోలు, ఎన్జీవోలు, రైతులు వ్యక్తిగతంగా లేదా సంఘంగా ఏర్పడి రుణాలు పొందవచ్చన్నారు. వ్యక్తిగతంగా రూ.10 లక్షలకు మించకుండా 35శాతం, సంఘంగా ఏర్పడితే రూ.3 కోట్లకు మించకుండా 35 శాతం రాయితీ ఉంటుందని చెప్పారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో కాఫీ, మిరియాలు, పసుపు, తదితర పంటలను సాగు చేస్తున్నారని తద్వార ఎంతోమంది రైతులకు జీవనోపాధి కలుగుతుందన్నారు. ఈ ఉత్పత్తులకు కోల్డ్ స్టోరేజీ అవకాశం కల్పిస్తే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందన్నారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా విభిన్న పంటలు పండుతాయని, ఆయా ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లాలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎం. సరస్వతి, జిల్లా లీడ్ మేనేజర్ రవితేజ, అగ్రికల్చర్, హార్టీకల్చర్, కాఫీ బోర్డు, స్పైసెస్ బోర్డు అధికారులు, బ్యాంకర్లు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, రైతులు పాల్గొన్నారు.

డిసెంబర్ నాటికి వైద్య కళాశాల నిర్మాణం పూర్తి

- ఏపీఎస్ఎంఐడీసీ చీఫ్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు



వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏపీఎస్ఎంఐడీసీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు

సాక్షి,పాడేరు: వైద్యకళాశాల భవన నిర్మాణాన్ని నిర్ణీత గడువు ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నామని ఏపీఎస్ఎంఐడీసీ చీఫ్ ఇంజనీర్ కె. శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన ఇంజనీరింగ్ అధికారుల బృందంతో కలిసి పాడేరు వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు చురుగ్గా జరుగుతుండటంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంతవరకు ఖర్చు పెట్టిన నిధులు, పనుల పురోగతి, మెటీరియల్, నాణ్యత ప్రమాణాలు తదితర అంశాలపై ఇంజనీరింగ్ అధికారులు, ఎన్‌సీసీ నిర్మాణ సంస్థ ఇంజనీర్లతో సమీక్షించారు. వచ్చే ఏడాది వైద్య కళాశాలను ప్రారంభించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, పనులు వేగవంతంగా జరగాలని ఆదేశించారు. అనంతరం పాడేరు జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. ఇక్కడ అందుబాటులో ఉన్న భవనాలు, ఇతర మౌలిక సదుపాయాలపై ఆయన ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ కృష్ణారావుతో సమీక్షించారు. రెండవ అంతస్తు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. నాడు–నేడు ఆస్పత్రుల అభివృద్ధి విభాగం డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, ఎన్‌సీసీ నిర్మాణ సంస్థ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఇంజనీర్లు ప్రకాష్, రూప్‌కుమార్, ఏపీఎస్ఎంఐడీసీ ఎస్ఈ శివకుమార్, ఈఈ అచ్చంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహాభూత లోకోత్సవానికి ఆహ్వానం

అడ్డతీగల: మహారాష్ట్ర కొల్హాపూర్ శ్రీ సిద్ధగిరి మహాసంస్థానంలో వచ్చే 20 నుంచి 26 వరకు నిర్వహించనున్న పంచ మహాభూత లోకోత్సవంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందిందని స్థానిక పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు, స్వామీజీ తణుకు వెంకటరామయ్య తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

హుకుంపేట: గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా కోరారు. శనివారం ఆయన మండలంలోని గూడలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గొచ్చురి అంగన్‌వాడీ కేంద్రాల్లో వ్యాక్సినేషన్, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. అనారోగ్యంతో శిశువు మృతి శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. గడుగుపల్లి గ్రామంలో శిశువు తల్లి, కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడారు. వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పాడేరు జిల్లా ఆస్పత్రిని సందర్శించి శిశుమరణాలకు గల కారణాలపై తక్షణమే సంజాయిషీ ఇవ్వాలని వైద్యాధికారిణి నీరజను ఆదేశించినట్టు డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. అత్యవసర వైద్యానికి వచ్చినప్పుడు అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకోవాలని సూచించినట్టు ఆయన తెలిపారు. జిల్లా టీబీ పర్యవేక్షక అధికారి కిరణ్, ఆరోగ్యవిస్తరణాధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో లాభాలు

చింతపల్లి రూరల్: గిరిజన రైతులు ఉద్యాన పంటల సాగు చేయడం ద్వారా మంచి లాభాలు సాధించవచ్చని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సురేష్‌కుమార్ సూచించారు. స్థానిక పరిశోధనస్థానంలో శనివారం చింతపల్లి, జీకేవీధి,కొయ్యూరు రైతులకు ఉద్యాన పంటల సాగుపై ఆత్మ సంస్థ సౌజన్యంతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పలు సూచనలు చేశారు. ఈ ప్రాంత వాతవరణ పరిస్థితులు వివిధ రకాల ఉద్యాన పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందన్నారు. పూల సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలమన్నారు. గిరి రైతులు గంజాయి సాగుకు దూరంగా ఉంటూ ప్రభుత్వ పోత్సాహంతో ఉద్యాన, వ్యవసాయ పంటలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఆత్మ పీడీ ఆశాజ్యోతి, శాస్త్రవేత్తలు సందీప్‌నాయక్, చెట్టి బిందు, సహ పరిశోధకుడు డాక్టర్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ

పాడేరు రూరల్: పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలు, గురుకుల పాఠశాలల్లో 2022-23 విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న అధ్యాపకులు, ఉపాధ్యాయ పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో, గురుకులం కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. పీజీటీ మ్యాథ్స్ ఒకటి, తెలుగు లెక్చరర్ ఒకటి, ఇంగ్లీష్ లెక్చరర్ మూడు, ఇంగ్లీష్ లెక్చరర్(ఒకేషనల్) ఒకటి, మ్యాథ్స్ లెక్చరర్ మూడు, బోటనీ లెక్చరర్ ఒకటి, జువాలజీ లెక్చరర్ ఒకటి, హిస్టరీ లెక్చరర్ ఒకటి, కామర్స్(ఒకేషనల్) లెక్చరర్ ఒకటి, జీఎఫ్‌సీ(ఎకనామిక్స్) లెక్చరర్ ఒకటి, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ టీచర్స్ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హత అభ్యర్థులు ఈనెల 23 నుంచి 30 లోగా దరఖాస్తులను పాడేరు ఐటీడీఏ గురుకులం విభాగంలో అందజేయాలని ఆయన పేర్కొన్నారు. ఈనెల 31, వచ్చే నెల ఒకటో తేదీన ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. వచ్చే నెల 2,3 తేదీల్లో పాడేరు గురుకుల కళాశాల, పాఠశాలల్లో జరిగే డెమోకు అర్హులైన అభ్యర్థులు విద్యార్హతకు సంబంధించిన ఒరిజినల్ సరిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఇంగ్లీష్ మీడియం అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. బాలికల పాఠశాలలు, కళాశాలల్లో పని చేసేందుకు మహిళ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులు ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో మాత్రమే పని చేయాల్సి ఉంటుందని తెలిపారు.

లీజుకు ఆర్టీసీ స్థలాలు



సమావేశం నిర్వహిస్తున్న ప్రజా రవాణా సంస్థ డిప్యూటీ సీటీఎం వెంకటరావు

పాడేరు రూరల్: పాడేరు ఆర్టీసీ డిపో, అరకు ఆర్టీసీ బస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 15 ఏళ్ల పాటు పాటు లీజు ప్రాతిపదికన ఇస్తున్నట్లు ప్రజా రవాణా సంస్థ డిప్యూటీ సీటీఎం కణితి వెంకటరావు, పాడేరు డిపో మేనేజర్ రోణంకి సీతారామనాయుడు, డిప్యూటీ ఇంజనీర్ పీవీ నర్సింగరావు తెలిపారు. శనివారం ఆర్టీసీ డిపో కార్యాలయంలో జిల్లాలోని పలువురి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పాడేరు డిపో గ్యారేజీ వెనుక ఉన్న ఖాళీ స్థలంతో పాటు అరకు బస్ స్టేషన్ ఖాళీ స్థలాలను ఓపెన్ టెండర్ల ద్వారా లీజుకు ఇస్తామని వారు వివరించారు. ఈ అవకాశాన్ని జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు, పూర్తి వివరాలను ఆర్టీసీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని వారు వివరించారు. పూర్తి వివరాలకు 7382810444, 9440628092 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

పాడేరు రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఐ.కొండలరావు అన్నారు. ఐటీడీఏలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా భావించి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఐటీడీఏలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు ఐటీడీఏ ఉద్యోగుల నుంచి 10 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ జమాల్‌బాషా, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ సొనారి గంగరాజు, కార్యదర్శి టి. అప్పారావు, జిల్లా కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు, సభ్యులు లోహితాష్, గౌరీశంకర్, సంజీవరాజు, జయమ్మ, సీతారామయ్య, వైద్యాధికారి రూపకళ, పాడేరు జిల్లా ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

ముంచంగిపుట్టు: మండలంలో 23 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద 2020 సంవత్సరం నుంచి 2022 వరకు చేసిన పనులపై జిల్లా డ్వామా పీడీ రమేష్ రామన్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో రూ.47కోట్లతో చేసిన ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. గత నెల 27 నుంచి ఈ నెల 11 తేదీ వరకు గ్రామాల్లో సోషల్ ఆడిట్ బృందాలు వెళ్లి పనులపై తనిఖీలు చేసి, గ్రామ సభలు నిర్వహించారు. గ్రామాల్లో గుర్తించిన ఉపాధి పనుల అక్రమాలపై ప్రజావేదికలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజల సమక్షంలో చర్చించారు. ఉపాధి హామీ, సమగ్ర శిక్ష అభియాన్, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం, పంచాయితీరాజ్, ఐటీడీఏ శాఖాల ద్వారా జరిగిన పనులపై ప్రజావేదికలో వాదనలు జరిగాయి. ఉపాధి పనుల బిల్లుల చెల్లింపులపై అధికారులను ప్రజలు ప్రశ్నించారు. రహదారికి ఇరువైపులా గతంలో నాటిన మొక్కలు రహదారి విస్తరణలో లేకుండా పోయాయని, మరలా పంచాయతీల నుంచి ఆ మొక్కలను నాటాలని పీడీ రమేష్ రామన్ సిబ్బందికి సూచించారు. ఏపీడీ గిరి, ఎస్ఆర్‌పి రామచందర్‌రావు,ఏపీవో సూరిబాబు, డీఆర్‌పీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

సంఘాల నుంచి రక్షణ కల్పించాలని వినతి



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

సాక్షి, పాడేరు: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల నిర్వాహకులపై పలు సంఘాల నేతలు అవినీతి ఆరోపణలు చేస్తూ మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని గిరిజన సంక్షేమ ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. పలు సంఘాలకు చెందిన నేతలు రాధాకృష్ణ, ప్రభుదాస్‌తో పాటు మరికొంతమందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జేఏసీ నేతలు కె.రామారావు, జి.సాంబాబు, రీమలిజాన్, పలాసి కృష్ణారావు, శ్రీనివాసపడాల్, సోమెలి సింహాచలం మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల నిర్వాహకులతోపాటు బోధన, బోధనేతర సిబ్బంది 24 గంటల పాటు శ్రమిస్తున్నారన్నారు. అయినప్పటికీ పలు సంఘాల నేతలు ఇబ్బంది పెడుతున్నారని, సమాజంలో చులకన చేస్తున్నారని వాపోయారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అనారోగ్య సమస్యలతో విద్యార్థుల మరణాలు చోటుచేసుకున్నాయని, ఆ సమయంలో వారి తల్లిదండ్రులను రెచ్చగొట్టి ఆందోళన కార్యక్రమాలతో తమకు మరింత ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడేటట్టు చేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. ఏడాదిలో రెండు సార్లు వారి సంఘాల ఫండ్ కలెక్షన్ పేరుతో ఆశ్రమ పాఠశాలల నిర్వాహకుల నుంచి డబ్బులు వసూలు చేశారని వారు వాపోయారు. ఐఏఎస్‌లతో పాటు ఇతర అధికారులను కూడా వారు టార్గెట్ చేస్తున్నారని కలెక్టర్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, వార్డెన్లు, పీడీ, పీఈటీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యలక్ష్మి

పెదబయలు: బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. సూర్యలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బాల్య వివాహాలు, వాటి వల్ల కలిగే నష్టాలపై కల్పించారు. బాలికలు చదువుపై దృష్టి పెట్టాలని, 21 ఏళ్లు దాటిన తరువాతనే వివాహం చేయాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. మండలంలోని అడుగులపుట్టు పంచాయతీ తమరాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. కేంద్రంలో అందిస్తున్న అంగన్‌వాడీ సేవలకు పరిశీలించారు. ప్రీస్కూల్ నిర్వహణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం అమలు తీరును ఆమె పరిశీలించారు. అలాగే మాత శిశు మరణాల నిరోధానికి చర్యలు తీసుకోవాలని, చలికాలంలో చంటి పిల్లలపై ప్రత్యేకశ్రద్ధ కనబరచాలని కోరారు. ప్రతీ మహిళ తమ తమ ఫోన్లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆపదలో ఉన్నప్పుడు దానిని ఉపయోగించాలని సూచించారు. నిమిషాల వ్యవధిలో పోలీసులు స్పందించి రక్షణ కల్పించేందుకు వీలు పడుతుందన్నారు. ప్రభుత్వం దిశ యాప్ ద్వారా ప్రతీ రోజు ఆపదలో ఉన్న వేల మంది రక్షణ పొందుతున్నారని ఆమె వివరించారు. సీడీపీవో రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ,సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనతతో మహిళ మృతి



సన్యాసమ్మ మృతదేహం

హుకుంపేట: రక్త హీనతతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. మండలంలో గత్తుం పంచాయతీ గాలిపాడు గ్రామానికి చెందిన జన్ని సన్యాసమ్మకు 10 నెలల క్రితం బాబు జన్మించాడు. అయితే కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో ఆమె బాధపడుతోంది. శరీరం బాగా వాపు రావడంతో మంగళవారం ఆమెను మండలంలోని ఉప్ప ప్రభుతాస్పత్రికి భర్త బాలరాజు తీసుకు వచ్చాడు. సన్యాసమ్మకు వైద్యాధికారులు పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత అధికంగా ఉందని వెంటనే కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలని సూచించారు. ఇందుకు డబ్బులు సిద్ధం చేసుకొని ఆస్పత్రికి వెళ్తానని వారి చెప్పి సన్యాసమ్మను స్వగ్రామమైన గాలిపాడు గ్రామానికి తీసుకువెళ్లాడు. ఈ నేపథ్యంలో భార్య ఆరోగ్యం క్షీణించడంతో శనివారం ఉదయం 11గంటల సమయంలో మృతి చెందింది. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ అనుషా మాట్లాడుతూ మంగళవారం ఆస్పత్రికి రాగానే వైద్య పరీక్షలు నిర్వహించి కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలని బతిమలాడామన్నారు. అయితే మృతురాలి భర్త ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఆమెను స్వగ్రామానికి తీసుకువెళ్లాడని చెప్పారు. అయినప్పటికీ ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు రెండు రోజుల క్రితం ఏఎన్ఎంను ఆమె వద్దకు పంపించామని చెప్పారు. నాటు మందును నమ్మి ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్లకపోవడంతో ఆరోగ్యం క్షీణించి మృతి చెందిందని తెలిపారు.

గుట్కా ప్యాకెట్లు, ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో నిషేధిత గుట్కాలు, ప్లాస్టిక్ కవర్లను వ్యాపారుల నుంచి గిరిజన సంఘం నేతలు ఎంఎంశ్రీను, పి.భీయరాజు,గాసీ రాందోర,వర్తక సంఘం అధ్యక్షుడు ప్రసన్నకుమార్ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్ల విలువ రూ.45 వేలు ఉంటుందని వారు చెప్పారు. స్వాధీనం చేసుకున్న వాటిని పంచాయతీ కార్యదర్శి గోపి, వీఆర్వో రమేష్ సమక్షంలో తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

దేవీపట్నం: ఇందుకూరుపేటకు చెందిన అడపా చిన్నోడు అనే రైతు శుక్రవారం సాయంత్రం ట్రాక్టర్ ట్రాలీపై వరి గడ్డి లోడ్ చేసుకుని తెల్లవారుజామున వేరే గ్రామానికి తరలించేందుకు సమీప శ్మశాన వాటిక వద్ద వాహనాన్ని నిలుపుదల చేశాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో ట్రాలీతో సహా వరి గడ్డి మొత్తం కాలి బూడిదైంది. ఈ ఘటనలో రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

కోడిపందాల శిబిరంపై దాడి



పందెంరాయుళ్లతో పోలీసులు

కొయ్యూరు: అంతాడ-కొత్తపల్లి గ్రామాల మధ్య జీడిమామిడితోటల్లో నిర్వహిస్తున్న కోడిపందాల శిబిరంపై స్థానిక పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు.11 మందిని అదుపులోకి తీసుకుని ఐదు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐలు రాజారావు, లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏపీఎస్పీ పోలీసులు దాడులు నిర్వహించారు.

ఆలస్యంగా సూర్యోదయం



కుమ్మరిపుట్టు మత్స్యగెడ్డ వద్ద మంచులో పడవపై వెళ్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతంలో పొగమంచు దట్టంగా కురుస్తోంది. చలితీవ్రతకు గిరిజనులు వణికిపోతున్నారు. ఉదయం 10 గంటల వరకు సూర్య కిరణాలు భూమిని తాకడం లేదు. సుజనకోట, దాబ్రైల, పెదగూడ, డొడిపుట్టు, వనుగుమ్మ పంచాయతీల పరిధిలోని మత్స్యగెడ్డ పరివాహిక ప్రాంతంలో గిరిజనులు రోజువారి పనుల నిమిత్తం పొగమంచులోనే నాటు పడవలపై ప్రయాణం సాగిస్తున్నారు.



అమరన్నకు
జన్మదిన శుభాకాంక్షలు
HAPPY BIRTHDAY DEAR LEADER
జగనన్న
నవరత్నాలు
చెప్పినవి.. చెప్పనివి...
రాష్ట్ర భవితకు ఆభరణాలు
కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా...
జగనన్న నవరత్నాలను అర్హులందరికీ అందించి...
ప్రజల కష్టాలు కడతేర్చి.. జనం గుండెల్లో నిలిచి...
మా గుండెల్లో గూడు కట్టుకున్న జనహృదయనేత
పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు &
వాణిజ్యం, సమాచార సాంకేతిక మంత్రివర్యులు
శ్రీ గుడివాడ అమర్‌నాథ్ గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు...
INDOSOL
HYDERABAD

క్లుప్తంగా

ప్రతి సోమవారం అర్చక సమస్యలపై 'స్పందన'


ఎండోమెంట్ ఏసీ మహాలక్ష్మి నగేష్

అనకాపల్లి టౌన్: దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకుల సమస్యలపై ప్రతి సోమవారం స్థానిక నూకాంబిక ఆలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ చెప్పారు. ఆలయ ఆవరణలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులు, ఉద్యోగుల సర్వీస్, జీతాల సమస్యలపై నిబంధనల మేరకు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

శరవేగంగా వైద్య కళాశాల పనులు


బేస్‌మెంట్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: భీమబోయినపాలెం వద్ద జరుగుతున్న వైద్య కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శనివారం ఈ పనులను పరిశీలించారు. 52.15 ఎకరాల్లో రూ.500 కోట్లతో వైద్య కళాశాల పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రస్తుతం జరుగుతున్న బేస్‌మెంట్ పనులను పరిశీలించి ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణారెడ్డి, ఏపీఎంఐడీసీ డీఈ నగేష్‌తో మాట్లాడారు. మ్యాప్ ఆధారంగా ఏ ప్రాంతంలో ఏఏ భవనాలు నిర్మిస్తారనే వివరాలను కూడా తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రాజారావు, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు రమణ, గోవిందరావు, నాయకులు భద్రాచలం, హరిబాబు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం చెల్లించాలి

- బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేత రాజాన సన్యాసినాయుడు

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్‌లో విషవాయువులు పీల్చి అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన 539 మంది కార్మికులకు యాజమాన్యం రూ.లక్ష చొప్పున నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ యలమంచిలి నియోజక వర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు డిమాండ్ చేశారు. శనివారం అచ్యుతాపురంలో నిర్వహించిన బీజేపీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని కోరారు. ట్రిబ్యునల్ తీర్పు పట్ల హర్షం ప్రకటిస్తున్నామని తెలిపారు. బ్రాండిక్స్‌లో మళ్లీ ఇటువంటి సంఘటనలు జరగకుండా యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే బీజేపీ తరపున నిరసన తెలుపుతామని చెప్పారు. సెజ్‌లో పనిచేసే ప్రతీ కార్మికుడికి అండగా ఉంటామని తెలిపారు. ఈ సమావేశంలో మేరుగు కాసుబాబు, రాజాన రాజు, పల్లి రాజాబాబు, రాజాన రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

మీనా లోకం.. పిలుస్తోంది

- ప్రత్యేక ఆకర్షణగా అండర్ వాటర్ టన్నెల్
- కనువిందు చేస్తున్న వందలాది వెరైటీ చేపలు


జపాన్‌కు చెందిన కోయికార్ప్ చేపలు


అండర్ వాటర్ టన్నెల్

ఏయూక్యాంపస్: అదో అద్భుత ప్రపంచం. అక్కడ అడుగు పెట్టామంటే ఊహల్లో తేలిపోయే అనుభూతి. సముద్ర గర్భంలో సంచరిస్తున్నామన్న భావన. మైమరపించే సముద్ర గర్భ దృశ్యాలు. చుట్టూ వందల సంఖ్యలో అందమైన చేపలు.. వాటి కేరింతలు..అదో ప్రపంచాన్ని తలపిస్తోంది. మత్స్యలోకంలో విహరించే అనుభూతిని కలిగిస్తోంది. ఒకటా రెండా.. వందల రకాలు మత్స్యాలు మురిపిస్తున్నాయి. రా రమ్మని ఆహ్వానిస్తున్నాయి. ఇంకెందుకు ఆలస్యం ఓ సాయంత్రం వేళ అలా..విశాఖనగరంలో ఏర్పాటు చేసిన అండర్ వాటర్ టన్నెల్‌ను సందర్శిద్దామా..

ఇప్పటి వరకు అక్వేరియంలో మాత్రమే చేపల్ని చూసిన నగరవాసులకు అండర్ వాటర్ టన్నెల్ మరొక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. బీచ్‌రోడ్డు లోని ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో ఏర్పాటు చేసిన మీనా లోకం విశాఖ నగరానికి మరొక మణిహారంగా నిలుస్తోంది. ఇక్కడ ఏర్పాట చేసిన ఫన్ ఫెయిర్, హ్యాండీ క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన మత్స్య లోకం మంత్రముగ్ధులను చేస్తోంది.

కేరళ టు విశాఖ

అండర్ వాటర్ టన్నెల్ ప్రత్యేకంగా రూపకల్పన చేశారు. దీనికోసం కేరళకు చెందిన నిపుణులైన సిబ్బంది 20 మందికిపైగా నెలరోజుల పాటు పనిచేశారు. కేరళ నుంచి ప్రత్యేకమైన కంటైనర్లలో వివిధ రకాల చేపలను విశాఖకు తీసుకువచ్చారు. రెండు వరుసల్లో 40కిపైగా భారీ అక్వేరియంలు నిర్మించి వీటిలో పలు జాతుల చేపలను ఉంచారు. వీటిని చూసి తరువాత కొంత ముందుకు వెళ్లగానే మూడో వరుసలో అండర్ వాటర్ టన్నెల్ అక్వేరియం కనువిందు చేస్తుంది. మనం కింద నుంచి నడుచుకుంటూ వెళుతుంటే మన చుట్టూ నీట్లో సంచరిస్తున్న అందమైన రంగురంగుల చేపలు కనువిందు చేస్తాయి. విశాఖ నగరంలో గతంలో ఎన్నడూ ఇటువంటి అండర్ వాటర్ టన్నెల్ ఏర్పాటు కాలేదు. తొలిసాగినా ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి దీనిని ఏర్పాటు చేశారు.

మంచినీరు.. సముద్రపు నీరు

మత్స్యలోకంలో ఏర్పాటు చేయడం అంత సులభమైన విషయం కాదు. చేపలను సంరక్షించడం, వాటికి అవసరమైన ఆక్సిజన్ అందించడం, ఆహారం అందించడం వంటివి నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. కొన్ని చేపలు మంచి నీటిలో జీవనం సాగిస్తుండగా, మరికొన్ని సముద్రపు నీటిలో మాత్రమే జీవనం సాగిస్తాయి. దీని కోసం ప్రత్యేకంగా ఒక ఆక్సిజన్ ప్లాంట్‌ను సైతం ఏర్పాటు చేసుకున్నారు. నిత్యం పదుల సంఖ్యలో చేపలు అక్వేరియంలో, టన్నెల్‌లో చనిపోవడం జరుగుతుంది. వీటిని తొలగిస్తూ కొత్తవాటిని తీసుకురావడం నిరంతరం జరుగుతుంది. సముద్రపు నీటిలో జీవించే చేపలకు అవసరమైన సముద్రపు నీటిని తీసుకువచ్చి అక్వేరియంలో నీటిని తరచూ మార్చడం జరుగుతుంది. అదే విధంగా అధిక శాతం చేపలకు చికెన్‌ను ఆహారంగా అందించడం జరుగుతోంది. అండర్ వాటర్ టన్నెల్‌లో ఏసీలను ఏర్పాటు చేసి ఉష్ణోగ్రతలను ఎప్పటికప్పుడూ క్రమబద్ధీకరిస్తూ సంరక్షిస్తున్నారు.

వందల రకాలు

శాఖాహారం తీసుకుని జీవించే జెయింట్ గౌరింగ్, అత్యంత ఖరీదైన పులివాగ, అరవాన చేపలు ఇక్కడ ఉన్నాయి. కోయికార్ప్, కబూత, నల్లని, తెల్లని రంగుల్లో ఉండే పిరానా చేపలు, నల్లని, తెల్లని షార్క్ చేపలు, తనను తాను రక్షించుకోవడానికి విద్యుత్ తరంగాలను విడుదల చేసే ప్రమాదకరమైన పొడవైన ఎలక్ట్రిక్ ఈల్ చేప, ఇతర ప్రాణుల నుంచి తననుతాను రక్షించుకోవడానికి విషపూరితమైన ముళ్లను శరీరంపై కలిగి ఉండే లయన్ ఫిష్, రంగులు మార్చే ఆస్కార్ టైగర్, చైనాలో లభించే అరోనా చేప, పొడవాటి మీసాలతో ఎక్కువ కాలం జీవించే రెడ్ టైల్, చూడటానికి పువ్వులు, మొక్కలను పోలిన విధంగా ఉండే హనీ మూన్ ఫిష్ వంటివి చూడాలంటే ఇక్కడకు వెళ్లాల్సిందే. వీటితో పాటు హెలికాప్టర్ ఫిష్, ఏంజల్ ఫిష్, ఫ్లవరాన్ ఫిష్, స్టార్ ఫిష్ ఇలా వివిధ వెరైటీల చేపలు ఇక్కడ మనుసుని కట్టిపడేస్తాయి. పులిగామ, అమెజాన్ నదుల్లో లభించే అరవాన చేప రూ.6 లక్షలు వరకు ధర ఉంటుంది. హర్‌పైమ, ఈల్ చేపలు జత రూ. 3.5 లక్షలు వరకు ధర పలుకుతాయి.

ఆదరణ బాగుంది



నగరానికి వస్తున్న ఇతర రాష్ట్రాల పర్యాటకు సైతం పెద్దసంఖ్యలో అండర్ వాటర్ టన్నెల్‌ను చూడటానికి వస్తున్నారు. వైవిధ్యత ను విశాఖ ప్రజలకు అందించడానికి ప్రతి ఏడాది కృషిచేస్తున్నాం. విశాఖ ప్రజలు ఎల్లప్పుడూ కొత్తదనాన్ని స్వాగతిస్తారు. త్వరలో మరిన్ని జాతుల చేపలను ప్రత్యేకంగా కేరళ నుంచి తీసుకువస్తాం.

– రాజారెడ్డి, ఎగ్జిబిషన్ నిర్వాహకుడు

టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం

- నర్సీపట్నాన్ని గంజాయి అడ్డాగా మార్చిన అయ్యన్న
- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ మండిపాటు


ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: టీడీపీ హయాంలో రాష్ట్రం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని.. ఆస్తులు పోగేసుకునేందుకే ఆ పార్టీ నాయకులకు సరిపోయిందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకుడు అయ్యన్నపాత్రుడుపై తీవ్రంగా మండిపడ్డారు. అయ్యన్నపాత్రుడు ఇష్టం వచ్చినట్టు స్థాయికి మించి విమర్శలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. టీడీపీ నేతలు, అయ్యన్నపాత్రుడు, చంద్రబాబు, లోకేష్ సైకోల్లా ప్రవర్తిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో అభివృద్ధిని పక్కన పెట్టి అయ్యన్నపాత్రుడు వందల కోట్ల రూపాయలు సంపాదించాడని, అలాంటి అయ్యన్నపాత్రుడు నీతులు మాట్లాడుతుంటే ఆశ్చర్యమేస్తోందన్నారు. రాజకీయ స్వలాభం కోసం ఈ ప్రాంతాన్ని గంజాయి కేంద్రంగా మార్చింది అయ్యన్నపాత్రుడు కాదా అని ఎమ్మెల్యే మండిపడ్డారు. నర్సీపట్నంలో అయ్యన్నపాత్రుడు వెలగబెట్టిందేమీ లేదన్నారు. తమ ప్రభుత్వం నర్సీపట్నం అభివృద్ధికి రూ.16 కోట్లు మంజూరు చేసిందని, రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మిస్తున్నామని చెప్పారు. రైతుల కోసం రూ.470 కోట్లతో ఏలేరు–తాండవ ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తున్నామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక అయ్యన్నపాత్రుడు శాండిస్టిలా మాట్లాడుతున్నాడన్నారు.

బకాయిలెందుకున్నాయ్..!

- పాఠశాలల్లో రూ.30.18 లక్షల విద్యుత్ బకాయిలు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 2,024 స్కూళ్లలో పెండింగ్
- స్కూళ్లు, ఎమ్మార్సీ, క్లస్టర్లకు ఠంఛన్‌గా నిధులు
- ఈ ఏడాది రూ. 3.08 కోట్లు నిధుల మంజూరు
- అయినా పేరుకుపోతున్న విద్యుత్ బిల్లులు
- పెండింగ్ బిల్లులపై నివేదిక కోరిన విద్యాశాఖ


అనకాపల్లి జిల్లాలోని కట్టువాని అగ్రహారం ప్రాథమిక పాఠశాల

విశాఖ విద్య: గోపాలపట్నం ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌కు రూ.79,876లు విద్యుత్ బిల్లు పెండింగ్ ఉంది. విద్యార్థుల సంఖ్య మేరకు ఏటా పాఠశాల విద్యాశాఖ నుంచి స్కూల్ గ్రాంట్ మంజూరవుతున్నా, విద్యుత్ బకాయిలు చెల్లించకపోవటాన్ని అధికారులు గుర్తించారు. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం కట్టువాని అగ్రహారం ప్రాథమిక పాఠశాల రూ.327లు విద్యుత్ బకాయి చెల్లించాల్సి ఉంది. ఈ కారణంగా అక్కడ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సాంకేతిక కారణాలతో స్కూల్ గ్రాంట్ రావటం లేదని పాఠశాల హెచ్‌ఎం చెబుతుండగా, జాబితాలో మాత్రం సదరు స్కూల్‌కు నిధులు చెల్లింపులు జరుగుతున్నాయి. ఉపాధ్యాయులపై పాఠశాలల నిర్వహణ భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం స్కూల్ గ్రాంట్‌ను విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే మంజూరు చేస్తోంది. స్కూల్ కాంపోజిట్ గ్రాంట్‌తో పాటు, క్లస్టర్ రిసోర్స్ సెంటర్(సీఆర్సీ), మండల విద్యావనరుల కేంద్రం(ఎమ్మార్సీ)లకు సైతం నిధులు కేటాయింపులు జరుగుతున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో అయితే వీటి కోసమని ఏడాదంతా ఉపాధ్యాయులు ఎదురుచూడాల్సి వచ్చేది. ఒక్కోసారైతే, రెండేళ్లకోసారి అరకొరగా విడుదల చేసేవారు. కానీ విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ఉపాధ్యాయులపై ఆర్థిక భారం లేకుండా, నిర్వహణ నిధులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తోంది. అయినప్పటికీ, పాఠశాలల్లో విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ఇలా ఎందుకు జరుగుతుందనేది క్షేత్ర స్థాయి నుంచి నివేదిక కోరారు.

రూ.3.08 కోట్లు నిధుల మంజూరు

విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని 4,090 ప్రభుత్వ పాఠశాలలకు 202–23 విద్యా సంవత్సరానికి స్కూల్ కాంపోజిట్ గ్రాంట్ కింద రూ. 2,23,90,000లు మంజూరయ్యాయి. అదే విధంగా 260 క్లస్టర్ రిసోర్స్ సెంటర్లకు రూ.52 లక్షలు, 46 మండల విద్యావనరుల కేంద్రాలకు రూ.32.20 లక్షలు మంజూరయ్యాయి. సాంకేతిక కారణాలతో 163 పాఠశాలలకు నిధుల పీఎఫ్ఎంఎస్ ఖాతాలో ఉండిపోయాయి. అదే విధంగా ఎమ్మార్సీలకు కూడా కొంత మొత్తం వారి ఖాతాలకు జమ కాలేదు.


రూ.30.18 లక్షల విద్యుత్ బకాయిలు

మూడు జిల్లాల పరిధిలో 2,024 పాఠశాలలకు సంబంధించి రూ.30,18,318లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని విద్యుత్‌శాఖాధికారులు విద్యాశాఖకు నివేదించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత క్రమం తప్పకుండా పాఠశాల నిర్వహణ నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ, విద్యుత్ బకాయిలు పేరుకుపోవటానికి గల కారణాలేమిటనేది తెలుసుకునేందుకు విద్యాశాఖాధికారులు రంగంలోకి దిగారు.

ఎందుకలా..

విద్యుత్ సర్వీసు నంబర్ ఆధారంగా బకాయిలు పెండింగ్‌లో ఉన్న పాఠశాలల జాబితాను విద్యాశాఖ ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు పంపించారు. దీనిలో వాస్తమెంత..? ఎందుకు బిల్లులు చెల్లించలేదు..? ఎప్పటి నుంచి ఇలా జరుగుతుందనేది సమగ్ర వివరాలను అందజేయాలని అత్యవసర ఉత్తర్వులు జారీ విడుదల చేశారు. క్షేత్రస్థాయి నుంచి వాస్తవ పరిస్థితులపై నివేదిక వచ్చిన తరువాత బకాయిలపై ఏం చేయాలనేది ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

సకాలంలో నివేదిక ఇవ్వాలి



విద్యుత్ బకాయిలు ఉన్న పాఠశాలల జాబితాను ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖాధికారులకు పంపించాం. పాఠశాల యు–డైస్ కోడ్ అనేది కీలకం. దీని ప్రకారం జాబితా సరిచూసుకోవాల్సి ఉంది. ఎందుకు బిల్లులు చెల్లించలేదో తగిన వివరాలను సకాలంలో అందజేయాలని ఆదేశించాం. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– ఎ.శ్రీనివాసరావు, ఏఎంవో, సమగ్ర శిక్ష, ఉమ్మడి విశాఖ జిల్లా

కోట్ల విలువైన భవనం.. అశ్వాలకు స్థావరం


విశ్వప్రియ ఫంక్షన్ హాల్‌లో ఉన్న గుర్రాలు



- ఏపీఐఐసీ పరిధిలో రూ.1400 కోట్ల విలువైన విశ్వప్రియ ఫంక్షన్ హాల్
- భవనంలో గుర్రాలను కట్టుకుంటున్న రౌడీషీటర్
- ఖాళీ చేయమంటే సిబ్బందిని బెదిరిస్తున్న వైనం
- అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ సాగరతీరంలో కోట్ల రూపాయల విలువ చేసే కట్టడం విశ్వప్రియ ఫంక్షన్ హాల్.. చివరకు అశ్వాలకు స్థావరంగా మారిపోయింది. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఉన్న ఈ భవనాన్ని.. తన అడ్డాగా మార్చేశాడు ఓ రౌడీషీటర్. భవనంలో గుర్రాలను కట్టేసుకుంటున్నారు. అడుగుతున్న సిబ్బందిని బెదిరిస్తున్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో.. ఏపీఐఐసీ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. బీచ్‌రోడ్డులో విశ్వ ప్రియ ఫంక్షన్ హాల్ అని ఎవరినడిగినా ఠక్కున చెప్పేస్తారు. చూసేందుకు రాజుల కాలం నాటి భవనంగా కనిపించే ఈ ఫంక్షన్‌హాల్.. ఎన్నో కార్యక్రమాలకు వేదికగా నిలిచింది. చేతులు మారుతూ.. ప్రస్తుతం ఏపీఐఐసీ ఆధీనంలో ఉంది. పలు కార్యక్రమాలు, సినిమా షూటింగ్‌లకు కూడా ఈ భవనాన్ని అద్దెకు ఇస్తున్నారు. ఇటీవలే చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య సినిమా షూటింగ్ కూడా ఈ భవనంలో కొంత మేర జరిగింది. దీన్ని సంరక్షించేందుకు ఏపీఐఐసీ.. చుట్టూ ప్రహరీ నిర్మించింది. డిసెంబర్ 4న నేవీడే సందర్భంగా.. పార్కింగ్, ప్రజల సౌకర్యం కోసం జీవీఎంసీ సిబ్బంది కొంతమేర ప్రహరీని తొలగించారు. ఆ తర్వాత దాని విస్మరించారు. ఇక అప్పటి నుంచి దాదాపు రూ.1400 కోట్ల విలువ చేసే విశ్వప్రియ ఫంక్షన్ హాల్ భవనం గుర్రాల శాలగా మారిపోయింది.

ఏయ్.. నా జోలికొచ్చారా ఖబడ్దార్!

గుర్రపు బగ్గీలు నడిపే రౌడీషీటర్.. తన గుర్రాలకు అడ్డాగా రూ.కోట్ల విలువైన ఈ భవనాన్ని వినియోగించుకుంటున్నాడు. తొలుత ఆరుబయట గుర్రపు బగ్గీని ఉంచేవాడు. క్రమంగా హాల్ ఆవరణలో నాలుగైదు గుర్రాలను కట్టేసి గుర్రపు శాలగా మార్చేశాడు. అశ్వాలు, బగ్గీని తరలించాలని సెక్యూరిటీ సిబ్బంది పలుమార్లు అడిగితే.. ఇంకోసారి నాజోలికొస్తే ఖబడ్దార్ అంటూ తిట్లపురాణం అందుకుంటున్నాడు. ఓ సందర్భంలో చంపేస్తానంటూ బెదిరించాడని ఏపీఐఐసీ సిబ్బంది వాపోయారు. దీంతో ఆ వ్యక్తి జోలికి వెళ్లేందుకు అందరూ భయపడుతున్నారు. ఫలితంగా ఆ భవనాన్ని పూర్తిగా తన అశ్వాలకు నిలయంగా మార్చేసుకున్నాడు. దీనిపై ఏపీఐఐసీ సిబ్బంది త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. పోలీసులు కూడా స్పందించడం లేదని సిబ్బంది చెబుతున్నారు. ఈ భవనాన్ని ఏదైనా కార్యక్రమానికి ఇవ్వాలని ఏపీఐఐసీ భావిస్తున్నా.. పరిసరాలన్నీ దుర్గంధంతో నిండిపోయాయి. దీంతో ఆదాయాన్ని కోల్పోతున్నామని అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి.. భవనాన్ని పరిరక్షించేందుకు సహకారం అందించాలని కోరుతున్నారు.

గౌరమ్మకు నీరాజనం


వేంకటేశ్వరస్వామి వేషధారణ


దాడి వీరభద్రరావును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు


గౌరమ్మకు హారతిస్తున్న ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు


రథంలో ఊరేగుతున్న గౌరీపరమేశ్వరులు

అనకాపల్లి టౌన్ : ప్రఖ్యాతిగాంచిన వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల మహోత్సవం శనివారం ఘనంగా శనివారం ప్రారంభమైంది. ఉదయం అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తి ప్రత్యేక పూజలు చేసి, మొక్కలు చెల్లించుకున్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధులగుండా ఊరేగించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అడుగడుగునా పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున బారులు తీరారు. సాయంత్రం ప్రదర్శించిన పలు నేలవేషాలు జాతర ప్రియులను ఆకట్టుకున్నాయి. జాతరలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో చిన్నారుల ఆటవస్తువులు, గృహోపకరణాలు భారీగా అమ్ముడయ్యాయి. జిల్లాలోని పలు ప్రాంతాలను జాతరకు వేలసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రధాన రహదారి జనసంద్రమైంది. పట్టణ సీఐ దాడి మోహన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. రాత్రి 10 గంటలకు జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అర్ధరాత్రి 12 గంటలకు నిర్వహించిన మందుగుండు సీతారామయ్య బాణసంచా విన్యాసాలు ఆకర్షించాయి. సంక్రాంతి పండగకు విడుదలైన సినిమాలను రాత్రంతా పలు థియేటర్ల స్పెషల్ షోలుగా ప్రదర్శించారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

అమ్మవారిని ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు వేర్వేరుగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దాడిని ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్, విశాఖ టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, 83వవార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, వైద్యుడు రామ్మూర్తి, మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ, గైపూరి రాజు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, డీఎస్పీ బి.సునీల్ అమ్మవారిని దర్శించుకున్నారు.


పులి డ్యాన్స్


కాళికాదేవి నృత్యం

దేవరాపల్లిలో పార్కు నిర్మాణానికి కృషి

- ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు
- వీఎంఆర్‌డీఏ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి స్థల పరిశీలన


వీఎంఆర్‌డీఏ అధికారులకు సూచనలిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో పార్కు నిర్మాణానికి కృషి చేస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలోని పార్కు నిర్మించబోయే స్థలాన్ని వీఎంఆర్‌డీఏ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. పార్కు నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన డీఈ జె.సి.పి.సింగ్, ఏఈ వి.రవిశంకర్‌లకు సూచనలు చేశారు. పార్కు నిర్మాణానికి అవసరమైన మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఇరిగేషన్ ఏఈఈ జి.సత్యంనాయుడు, ఎంపీడీవో సీహెచ్. సుబ్బలక్ష్మి, ఈవోపీఆర్డీ కె.ఉషశ్రీ, వాలేటి నాగరాజు, కొరుపోలు శ్రీను తదితర్లు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయండి

విశాఖలీగల్: ఉమ్మడి విశాఖ జిల్లాలో వివిధ న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయమూర్తులు కృషి చేయాలని విశాఖ జిల్లా న్యాయమూర్తి గుత్తుల గోపి సూచించారు. శనివారం విశాఖ జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయమూర్తుల సమావేశ మందిరంలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన జూనియర్, సీనియర్, అదనపు జిల్లా న్యాయమూర్తులు, ప్రత్యేక న్యాయమూర్తుల సదస్సు జరిగింది. సదస్సును జిల్లా న్యాయమూర్తి గోపి ప్రారంభించారు. వివిధ న్యాయ స్థానాల్లో కేసుల వివరాలు, విచారణలో ఉన్న కేసులు, స్టేలో ఉన్నవి, తర వివరాలపై న్యాయమూర్తి సమీక్ష జరిపారు.

అపరాధ రుసుంతో టెన్త్ పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం

అనకాపల్లి టౌన్: ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని డీఈవో లింగేశ్వరరెడ్డి శనివారం పేర్కొన్నారు. తత్కాల్ పరీక్ష ఫీజు ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుంతో, 27 నుంచి 31వ తేదీ వరకు రూ.1000 అపరాధ రుసుంతో చెల్లించవచ్చని తెలిపారు.


కనులపండువగా అప్పన్న తెప్పోత్సవం



వరాహ పుష్కరిణి మధ్యలో ఉన్న మండపంలో స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



స్వామిని ఊరేగింపుగా వరాహ పుష్కరిణి వద్దకు తీసుకువస్తున్న దృశ్యం



వరాహ పుష్కరిణిలో విద్యుత్ కాంతుల్లో హంస వాహనం

సింహాచలం: పుష్య బహుళ అమావాస్యను పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం శనివారం కనులపండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేతుడై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వేణుగోపాలస్వామిగా దర్శనమిచ్చాడు. హంస వాహనంపై నౌకావిహారంలో కనువిందు చేశాడు. ఉత్సవాన్ని కనులారా తిలకించి భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో వరాహపుష్కరిణి అంతా కిటకిటలాడింది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామికి వేణుగోపాలస్వామి అలంకరణ చేసి శ్రీదేవి, భూదేవి సమేతంగా తొలిపావంచా వద్దకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి స్వామిని ఊరేగింపుగా వరాహ పుష్కరిణి వద్దకు తీసుకెళ్లారు. సాయంత్రం సుమారు 5 గంటల నుంచి తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వరాహ పుష్కరిణి మధ్యలో ఉన్న మండపం చుట్టూ మూడుసార్లు హంస వాహనాన్ని ప్రదక్షిణగా తిప్పారు. అనంతరం మండపంలో స్వామిని వేంజేపచేసి విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, షోడషోపచార పూజలు, విశేష ఆరాధనలు, పారాయణాలు నిర్వహించారు. తరువాత స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి సర్వజన మనోరంజని వాహనంపై వేంజేపచేసి గ్రామ తిరువీధి నిర్వహించారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన స్వామికి అడవివరం గ్రామస్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు, వేద పండితులు, పారాయణదారులు ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, వంకాయల సాయి నిర్మల, సువ్వాడ శ్రీదేవి, పెనుమత్స శ్రీదేవి వర్మ, దశమంతుల రామలక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితుడు చందు యాదవ్, దేవస్థానం ఎస్‌డీసీ రామలక్ష్మి ఉత్సవంలో పాల్గొన్నారు.

విశేషంగా ఏర్పాట్లు

తెప్పోత్సవాన్ని పురస్కరించుకుని ఈవో త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. స్వామివారు విహరించిన హంసవాహనాన్ని విశేషంగా తీర్చిదిద్దారు. వరాహ పుష్కరిణి వద్ద పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ చేశారు. పుష్కరిణి మధ్యలో ఉన్న మండపాన్ని సుందరంగా అలంకరించారు. నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



వరాహ పుష్కరిణి వద్ద కోలాటం ఆడుతున్న మహిళలు

స్టాఫ్ నర్సుల ఎంపికపై

ఇంటెలిజెన్స్ ఆరా!

ఉద్యోగుల అక్రమాలపై వివరాల సేకరణ

మహారాణిపేట(విశాఖ దక్షిణ): వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో స్టాఫ్ నర్సు పోస్టుల ఎంపికతో పాటు ఇతర వ్యవహారాలపై ఇంటెలిజెన్స్ పోలీసులు ఆరా తీశారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు పోస్టుల ఎంపికలో చక్రం తిప్పి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. దీనిపై శనివారం ఇంటెలిజెన్స్ పోలీసులు వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఎంపికైన అభ్యర్థులు, ఎంపిక కాని వారిని ప్రశ్నించారు. ఎవరికైనా డబ్బులు ఇచ్చారా? ఇస్తే ఎంత ఇచ్చారు? తదితర వివరాలు సేకరించినట్లు తెలిసింది. కాగా.. శనివారం కూడా కొంత మంది అభ్యర్థులు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయానికి వచ్చారు. ముందు జాబితాలో తమ పేర్లు ఉన్నాయని, కానీ తుది జాబితాలో పేర్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కొవిడ్ సమయంలో పని చేసిన తనకు వెయిటేజ్ మార్కులు కలిపితే కచ్చితంగా ఉద్యోగం వస్తుందని.. కానీ జాబితాలో పేరు లేదని విజయనగరం ప్రాంతానికి చెందిన ఓ నిరుద్యోగ నర్సు కన్నీరుమున్నీరయ్యారు. శనివారం మొత్తం 23 మంది అభ్యర్థులు తమకు పోస్టింగ్ రాలేదని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఉమా సుందరికి దరఖాస్తులు సమర్పించారు. ఇందులో 8 మంది తమకు కోవిడ్ వెయిటేజ్ మార్కులు కలపలేదని.. తమ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. శుక్రవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 36 మంది అభ్యర్థులు హాజరు కాలేదు. ఆ వివరాలను ఆర్డీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎంత మంది విధుల్లో చేరారు? ఇంకా ఎన్ని పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయో తక్షణమే వివరాలు తెలపాలని డీఎంహెచ్‌వో, విధాన పరిషత్, విమ్స్ అధికారులను ఆర్డీ ఉమా సుందరి కోరారు.

ప్రగతి వెంబడి పరుగులు..!


రెండో దశలో చంద్రపాలెం పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు గదులు

- శరవేగంగా నాడు–నేడు రెండో దశ పనులు
- విశాఖ జిల్లాలో 321 పాఠశాలల అభివృద్ధి
- జిల్లాకు రూ. 126.19 కోట్ల కేటాయింపు
- హైస్కూళ్లకు ప్రాధాన్యం
- ఇప్పటికే రూ.20.54 కోట్లు పనుల పూర్తి

విశాఖ విద్య: జిల్లాలో 321 పాఠశాలలను నాడు–నేడు రెండో విడతలో అభివృద్ధి చేస్తున్నారు. ఇందు కోసం ప్రభుత్వం జిల్లాకు రూ.126.19 కోట్లు మంజూరు చేసింది. ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేందుకని నాడు–నేడు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నేపథ్యంలో పనులు సకాలంలో పూర్తి చేసేలా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున జిల్లా విద్యాశాఖాధికారులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. నాడు–నేడు తొలి విడతలో ఉమ్మడి విశాఖ జిల్లాలో రూ.325.49 కోట్లుతో 1,130 పాఠశాలలను అభివృద్ధి చేశారు. దీనికి కొనసాగింపుగా రెండో విడతలో మరింత పారదర్శకంగా పనులు చేపట్టేలా దృష్టి పెట్టారు. జాతీయ విద్యా విధానం అమలు మేరకు పాఠశాలల్లో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేలా జిల్లా విద్యాశాఖాధికారులు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు.

విద్యాశాఖ చరిత్రలో ఇదే తొలిసారి

విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణల నేపథ్యంలో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో అవసరమైన చోట్ల అదనపు గదుల నిర్మాణానికి నాడు–నేడు రెండో దశలో ప్రాధాన్యత ఇచ్చారు. విశాఖపట్నం జిల్లా లోని 115 హైస్కూళ్లలో 540 అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. ఒక్కో అదనపు గది నిర్మాణానికి రూ.12 లక్షలు వెచ్చించనున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏదైనా పాఠశాలలో అదనపు గది నిర్మాణానికి నిధుల కోసమని ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. కానీ, ఒకే సారి ఈ రీతిన అదనపు గదులు నిర్మిస్తుండడం విశాఖ జిల్లా విద్యాశాఖ చరిత్రలో ఇదే తొలిసారి అని విద్యావేత్తలు, ఉపాధ్యాయులు అంటున్నారు. గతంలో పనులు చేపట్టి, వివిధ కారణాలతో అసంపూర్తిగా వదిలేసిన భవనాలను సైతం వినియోగంలోకి తీసుకొచ్చేలా నిధులు కేటాయించారు.



నాడు-నేడు మొదటి దశలో అభివృద్ధి చేసిన విశాఖ నగరంలోని మధురానగర్ స్కూల్

భవిష్యత్ అవసరాలు తీర్చేలా..

ప్రభుత్వ పాఠశాలల్లో భవిష్యత్ అవసరాలను తీర్చేలా పనుల గుర్తింపులో విద్యాశాఖాధికారులు శ్రద్ధ తీసుకున్నారు. తల్లిదండ్రుల కమిటీ సభ్యులను భాగస్వామ్యులను చేసి సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, అవసరమైన పనులు గుర్తించడంతో పాటు, వారంతా కలసి పనులు పూర్తి చేసేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. పేరెంట్స్ కమిటీలకు ఆర్థిక భారం లేకుండా, పనులు చేపట్టేందుకని ముందస్తు పెట్టుబడిగా(రివాల్వింగ్ ఫండ్) ఇప్పటికే రూ.18 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. పనులు పూర్తయ్యేంత వరకు విడతల వారీగా ఇలా ముందస్తు పెట్టుబడి నిధులు విడుదల చేసేలా అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫర్నిచర్, గ్రీన్ చాక్‌బోర్డు, ఎల్ఈడీ టీవీలు ఇలా సకల సౌకర్యాలు కల్పించేలా పాఠశాలల్లో శరవేగంగా పనులు జరుగుతున్నాయి.


పాఠశాలలో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాప్‌లు

నియోజకవర్గాల వారీగా రెండో దశలో చేపడుతున్న పనులు

నియోజకవర్గం	పాఠశాలల సంఖ్య	మంజూరైన నిధులు(రూ.లక్షల్లో)	విడుదలైన రివాల్వింగ్ ఫండ్(రూ. లక్షల్లో)
భీమునిపట్నం	156	5533.54	806.86
గాజువాక	70	2416.64	349.92
పెందుర్తి	58	2380.86	338.65
విశాఖ తూర్పు	17	931.62	123.95
విశాఖ దక్షిణం	6	651.85	97.79
విశాఖ పశ్చిమం	14	704.78	81.61
మొత్తం	321	12619.29	1798.78

పనులపై ప్రత్యేక దృష్టి



నాడు–నేడు పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనులు పర్యవేక్షిస్తున్నందున ఈసారి హెచ్‌ఎంలకు భారం తగ్గుతుంది. పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సౌకర్యాలు సమకూరుతాయి. హైస్కూళ్లలో అదనపు గదుల నిర్మాణం వల్ల తరగతుల నిర్వహణ ఎంతో సౌలభ్యంగా ఉంటుంది.

– డి.అప్పలనాయుడు, ఏపీవో, సమగ్ర శిక్ష, విశాఖ జిల్లా

క్లుప్తంగా

గర్భసంచి నుంచి భారీ కణితి తొలగింపు


కణితి తొలగించిన అనిల్ నీరుకొండ ఆస్పత్రి వైద్య బృందం

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి గైనకాలజీ విభాగపు వైద్యులు కొమ్మాదికి చెందిన ఎస్.లక్ష్మి అనే మహిళకు శస్త్రచికిత్స చేసి గర్భసంచి కంఠానికి ఉన్న 15x10 సెంటీ మీటర్ల కణితిని విజయవంతంగా తొలగించారు. కడుపు నొప్పి, మూత్ర సమస్యతో బాధపడు తూ ఇటీవల బాధితురాలు ఆస్పత్రి గైనకాలజీ విభాగ వైద్యులను సంప్రదించింది. ఎంఆర్‌ఐ స్కానింగ్ చేసిన వైద్యులు గర్భసంచి కంఠానికి, గర్భాశయానికి కణితులు ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు గైనిక్ వైద్యులు వి.ప్రభావతి, భాగ్యశ్రీ, హిరణ్మయి, కావ్య, జనరల్ సర్జన్ సత్యకుమార్ శస్త్రచికిత్స చేసి తొలగించారు. కణితి సైజు పెద్దది కావడంతో శస్త్రచికిత్స సమయంలో రక్తం ఎక్కించాల్సిన అవసరం వచ్చిందన్నారు. అరుదైన ఇలాంటి కణితులు వందలో ఒకరికి ఉంటాయని, ఇంత పెద్ద సైజులో కణితి ఉండటం అరుదుగా ఉంటుందన్నారు. ఆమెకు చికిత్స, పరీక్షలు, మందులు ఉచితంగా అందించి ఆరోగ్యంగా ఇంటికి పంపిస్తున్నట్టు వైద్యులు తెలిపారు.

జాతీయ పోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థి


విద్యార్థి యశ్వంత్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆరిలోవ (విశాఖ తూర్పు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్ యూత్ క్యారమ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన శ్రీకృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎం.యశ్వంత్‌ను పలువురు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన యశ్వంత్ ఫిబ్రవరిలో ముంబయిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫ్లోరిన్స్, వైస్ ప్రిన్సిపాల్ బి.రామకృష్ణ, అల్లు సత్య సుధాకర్, ఎస్.లక్ష్మణరావు తదితరులు యశ్వంత్‌ను అభినందించారు. యశ్వంత్ ఎంపికైన విషయం తెలుసుకున్న జిల్లా సమన్వయకర్త ఎస్.రూపావతి హర్షం వ్యక్తం చేశారు.

ఏఆర్ సిబ్బందికి మొబలైజేషన్


స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్న ఆచార్య ఎంవీ రాజు

అల్లిపురం (విశాఖ దక్షిణ): విధినిర్వహణలో పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న ఒత్తిడిని అధిగమించేందుకు వీలుగా నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ సిబ్బందికి మొబలైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. దీంట్లో భాగంగా శనివారం సూర్యాబాగ్, ఏఆర్ గ్రౌండ్స్‌లో ఆంధ్రా యూనివర్సిటీ సైకాలజీ విభాగానికి చెందిన ఆచార్య ఎంవీ రాజు పర్యవేక్షణలో స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ ఏఆర్ సిబ్బందికి తమ విధుల్లో, వ్యక్తిగతంగా ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో వివరించారు. అనంతరం వారితో స్ట్రెస్ రిలీజ్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏడీసీపీ (ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం, ఏఆర్ ఏసీపీలు ఆర్.పి.ఎల్.శాంతికుమార్, ఎ.రాఘవేంద్రరావు, ఆర్.ఐలు ఆర్.ఎస్.ఐలు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు ఇవ్వకపోయినా లోకేష్ పాదయాత్ర

- ఉత్తరాంధ్ర టీడీపీ ఇన్‌చార్జి బుద్ధా వెంకన్న

మహారాణిపేట: అనుమతులు ఇచ్చినా ఇవ్వకపోయినా కుప్పంలో ఈనెల 27వ తేదీన ఉదయం పది గంటలకు టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర మొదలవుతుందని ఆ పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్ధా వెంకన్న అన్నారు. శనివారం విశాఖ టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పాదయాత్ర చేస్తున్న లోకేష్ మీద దాడులు చేస్తారన్న అనుమానం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని లోకేష్ పాదయాత్రకు రక్షణ కల్పించాలని అన్నారు. పాదయాత్రకు ప్రజలు ఉత్సాహం చూపుతున్నారని జీవో నెంబర్ 1తో అడ్డుకోవాలని చూస్తున్నారని అన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ జోడో యాత్రకు బీజేపీ అధికారంలో ఉన్న పలు రాష్ట్రాలు అనుమతులు ఇచ్చాయన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు వ్యక్తిగతంగా ఏమి అనలేదని ఆయన అన్నారు.

ఆకట్టుకున్న జానపద నృత్యం


నృత్యకళాకారిణికి సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం(విశాఖతూర్పు): స్నేహ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో విశాఖ కళాభారతి ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన జానపద నృత్య ప్రదర్శ న విశేషంగా ఆకట్టుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పలు నృత్య కళాక్షేత్రాలకు చెందిన నాట్య కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొన్ని వారి నృత్య ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా శ్రీ సిద్ధేంద్ర కూచిపూడి కళాక్షేత్రం ప్రతినిధి డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్, కళారాధన మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ సెక్రటరీ, నాట్యగురువు తాళ్లపాక సందీప్‌కుమార్ అకాడమీ వ్యవస్థాపక ఆర్గనైజర్ కె.నాగరాజు చేతుల మీదుగా పలువురు కళాకారులకు సర్టిఫికెట్లను అందజేశారు. విశాఖ వేదికగా జరిగిన కళా ప్రదర్శనలో భాగంగా నాట్యవేద కూచిపూడి డ్యాన్స్ అకాడమీ నాట్య గురువు దివాకర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న ముత్తా వైష్ణవి ధాత్రి చేసిన కూచిపూడి నాట్య ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

భద్రతా పనుల నేపథ్యంలో ఈస్ట్‌కోస్ట్ రైలు రద్దు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): సౌత్ ఈస్టర్న్ రైల్వే, ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు భద్రతా పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే హైదరాబాద్–షాలిమార్–హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను ఆయా తేదీలలో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 29, 31, ఫిబ్రవరి 1 తేదీలలో బయల్దేరవలసిన హైదరాబాద్– షాలిమార్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు. తిరుగు ప్రయాణంలో షాలిమార్‌లో ఈ నెల 30, ఫిబ్రవరి1,2 తేదీలలో బయల్దేరవలసిన షాలిమార్–హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

ఎంఎస్‌ఎంఈలకు షిప్‌యార్డు ప్రోత్సాహం

షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ ఖత్రి


మాట్లాడుతున్న హిందూస్తాన్ షిప్ యార్డు లిమిటెడ్ సీఎండీ హేమంత్ ఖత్రి

అక్కిరెడ్డిపాలెం (గాజువాక): ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌పో – 2023 శనివారం సాయంత్రంతో ముగిసింది. కార్యక్రమంలో హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సీఎండీ హేమంత్ ఖత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈలకు షిప్‌యార్డు ఎన్నో అవకాశాలను కల్పిస్తోందన్నారు. ప్రొక్యూర్‌మెంట్ పాలసీ ద్వారా పారిశ్రామిక వేత్తలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. ఎంఎస్‌ఎంఈ అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ వల్ల రూ.2 కోట్ల వ్యాపారం జరిగిందన్నారు. గెయిల్ ఇండియా సీజీఎం అండ్ ఓఐసీ ఎల్.ఎస్.రావు మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈలకు గ్యాస్ సరఫరా ద్వారా ఎన్నో ప్రయోజనాలు చేకూర్చుతున్నామన్నారు. గ్యాస్ పైప్‌లైన్లకు, నివాసాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ల వల్ల జరిగే ప్రమాదాలను వివరించారు. అనంతరం ఎంఎస్‌ఎంఈ ఇన్‌చార్జ్ ఏడీ జి.వి.ఆర్.నాయుడు నేతృత్వంలో స్టాళ్ల ఏర్పాటు చేసిన పారిశ్రామిక వేత్తలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. వాసీవా అధ్యక్ష, కార్యదర్శి ఏకే బాలాజీ, డి.వినోద్ నేతృత్వంలో ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

వచ్చే ఏడాదిలో అయోధ్య రామమందిర దర్శనం

ఉక్కునగరం: అయోధ్యలో నిర్మాణమవుతున్న రామ మందిరాన్ని భక్తులకు వచ్చే ఏడాదిలో దర్శించుకునే అవకాశం కలుగుతుందని బీజేపీ గాజువాక నియోజకవర్గం కో–ఆర్డినేటర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. స్థానిక అంబేడ్కర్ కళాక్షేత్రంలో శనివారం విశ్వ హిందూ పరిషత్ ఉత్తరాంధ్ర ప్రాంత సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలను కరణంరెడ్డి నరసింగరావు, ఉక్కు డైరెక్టర్ (ఫైనాన్స్) వి.వి.వేణుగోపాలరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ 500 ఏళ్ల నాటి కల అయోధ్యరామ మందిరమన్నారు. అది విశ్వ హిందూ పరిషత్, దేశ ప్రధాని నరేంద్ర మోదీ చొరవతో సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రాంత అధ్యక్షులు వబిలిశెట్టి వెంకటేశ్వర్లు, కేంద్ర కార్యదర్శి గుమ్మల సత్యం, ప్రాంత కార్యదర్శి టి.ఎస్. రవికుమార్, ఉపాధ్యక్షులు పి.వి.ఎస్.నాయుడు పాల్గొన్నారు.

బాల్యం నుంచి నైతిక విలువలు పెంపొందించాలి

త్రిదండి చిన జీయర్ స్వామి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చిన జీయర్ స్వామి

కొమ్మాది (భీమిలి): బాల్యం నుంచి నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యతలను వివరించే విధంగా వికాస తరంగణి పని చేయాలని త్రిదండి చిన జీయర్ స్వామి అన్నారు. భీమిలి బీచ్ రోడ్ మంగమారిపేటలో గల వారిజా నేత్ర విద్యాలయంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వికాస తరంగణి శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలంతా భగవద్గీత పఠించే విధంగా ప్రేరేపించాలని సూచించారు. సమాజంలో ఎలా ప్రవర్తించాలి, సత్ప్రవర్తనతో ఎలా మెలగాలి అనే విషయాలను వివరించారు. సంస్కార వికాస్, ఆరోగ్య వికాస్ 15 సంవత్సరాలలోపు వారికి తెలియజేయాలన్నారు. సమాజంలో యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా వారిలో పరివర్తన తీసుకొచ్చే విధంగా వికాస తరంగణి కృషి చేయాలిని కోరారు. అవసరమైన వారికి అవయవ దానం, పేదలకు దుస్తుల పంపిణీ, బీచ్ క్లీనింగ్, పంటలు పండించే రైతులకు సహాయం అందించే కార్యక్రమాలు వికాస తరంగణి చేపడుతుందని ఆయన తెలిపారు. సమాజంలోని రుగ్మతలపై వికాస తరంగణి ర్యాలీలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో జీయర్ సంస్థల సెంట్రల్ కమిటీ సభ్యులు ఎమ్.జగన్నాథరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.టి.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు


మిందిలో మంత్రి అమర్‌నాథ్‌ను గజమాలతో సత్కరిస్తున్న గుడివాడ అభిమానులు

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పుట్టిన రోజు వేడుకలు శనివారం మిందిలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఆయన నివాసం నుంచి గ్రామం నడిబొడ్డు వరకు విద్యుత్ దీపాల వెలుగులు వెదజల్లాయి. డప్పు కళాకారుల వాయిద్యాలు, విన్యాసాలతో సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామంలో పండగ వాతావరణం చోటు చేసుకుంది. ప్రముఖ గాయకుడు ధనుంజయ్ తన పాటలతో యువతను ఉర్రూతలూగించారు. మంత్రి అయిన తర్వాత తొలిసారిగా వచ్చిన ఆయన పుట్టినరోజును గ్రామస్తులు, గుడివాడ అభిమానులు ఘనంగా నిర్వహించారు.

ప్రేమ మత్తులో తండ్రిపై కుమార్తె దాడి

సీతమ్మధార(విశాఖ ఉత్తర): ప్రేమ మత్తులో ఓ విద్యార్థిని కన్నతండ్రిపై చాకుతో దాడికి పాల్పడిన ఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ..శంకర మఠం దరిలో నివాసం ఉంటున్న ముకుందరావుకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేటరింగ్ పనులు చేస్తుంటాడు. కుమార్తెను రామాటాకీస్ దరి ఓ కళాశాలలో చదివిస్తున్నాడు. కంచరపాలెం ఐటీఐలో చదువుతున్న ఓ విద్యార్థితో ఆమెకు పరిచయం ఏర్పడింది. తర్వాత ప్రేమగా మారడంతో వివాహం చేసుకుంటానని ఆమెను అతను నమ్మించాడు. ఈ క్రమంలో ఆ విద్యార్థిని తన ఇంటిలో ఉన్న రూ.2 లక్షలు, 8 తులాల బంగారు ఆభరణాలను అతన్ని ఇచ్చింది. ఈ విషయం ఆమె తండ్రికి తెలిసి.. కుమార్తెను నిలదీశాడు. తండ్రీ కుమార్తెల మధ్య కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయాన్ని ఆమె తన ప్రియుడికి తెలిపింది. తన దగ్గర డబ్బులు, ఆభరణాలు లేవు. నువ్వే ఏదో ఒకటి చేయమని చెప్పి అతను తప్పించుకునే ప్రయత్నం చేశాడు. దీంతో ఆమె శనివారం రాత్రి తండ్రి నిద్రిస్తున్న సమయంలో చాకుతో అతనిపై దాడికి పాల్పడింది. ఈలోపు అతను మేల్కొనడంతో చాకు వీపుకు తగిలి గాయమైంది. ఈ ఘటనపై ముకుందరావు ఫోర్త్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమెను జువైనల్ హోంకు తరలిస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో జిల్లా పరిశ్రమల అధికారి గణపతి తదితరులు

సాక్షి, విశాఖపట్నం: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని, పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తుందని జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లికార్జున అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కమిటీ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ఔత్సాహిక పారిశ్రామి వేత్తలకు ప్రోత్సాహం అందివ్వాలన్నారు. ఈనెల 19వ తేదీ నాటికి సింగిల్ డెస్క్ పోర్టల్లో 152 దరఖాస్తులు రాగా అందులో 121 దరఖాస్తులు నిర్దేశించిన గడువులోగా ఆమోదించామని, 4 దరఖాస్తులు తిరస్కరించామని, మిగిలిన 27 దరఖాస్తులు ఎస్.ఎల్.ఎ పరిధిలో పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. గాజువాకలో నిర్మిస్తున్న కార్మిక రాజ్య బీమా ఆసుపత్రికి సంబంధించి అన్ని అనుమతులు సత్వరం మంజూరు చేయాలని జీవీఎంసీ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. 23 మంది పారిశ్రామికవేత్తలకు రూ. 85,28,444 ప్రోత్సాహకాలు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఐపీఈ 2015–20 కేటగిరీ కింద ఎంఎస్‌ఎంఈ ఆన్‌లైన్‌లో నమోదైన 10 క్లెయిమ్‌లకు గాను రూ.51,03,913, ఐడీపీ 2020–23 కేటగిరిలో 9 క్లెయిమ్‌లకు గాను రూ.43,53,490 ప్రోత్సాహకాలు సిఫార్సు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సి.హెచ్.గణపతి, ఏపీఐఐసీ జెడ్‌ఎం రంగయ్య, ఐలా ఆటోనగర్ ప్రెసిడెంట్ బాలాజీ, చిన్న పరిశ్రమల ప్రెసిడెంట్ సాంబశివరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భరతమాత రక్షకులకు తర్ఫీదు

- ఓ మాజీ సైనికుడి గొప్ప మనసు
- రక్షణ రంగంలో చేరాలనుకునే వారికి శిక్షణ
- ఇప్పటికే పలువురికి ఉద్యోగాలు


శిక్షణ పొందుతున్న యువత


లాంగ్ జంప్ కోసం సిద్ధమవుతున్న మైదానం

పెదగంట్యాడ: అతనో సైనికుడు.. దేశ రక్షణ కోసం ఆర్మీలో చేరి 15 ఏళ్ల పాటు సేవలందించారు.. అక్కడితో ఆగిపోకుండా.. ఆర్మీలో చేరేందుకు ఉత్సాహం ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితుల కారణంగా వెనుకడుగు వేస్తున్న వారిని గుర్తించి.. వారిలో ఉత్సాహం నింపి శిక్షణ ఇచ్చి.. నిష్ణాతులుగా మార్చి.. ఉద్యోగాలు పొందే వరకూ అలుపు లేకుండా తర్ఫీదు ఇస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు పెదగంట్యాడ మండలం నడుపూరుకు చెందిన రౌతు గోవిందరావు. 2000వ సంవత్సరంలో ఆర్మీలో చేరిన గోవిందరావు 15 ఏళ్ల పాటు జనరల్ డ్యూటీ సోల్జర్‌గా సేవలందించి ఉద్యోగ విరమణ పొందారు.. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పని చేసిన ఆయన దేశ రక్షణ కోసం అహర్నిశలు పాటుపడ్డారు. ప్రస్తుతం దేశ రక్షణ కోసం తనలాగే ఎంతోమందిని తీర్చిదిద్దే పనిలో ఉన్నారు. ఇప్పటికే ఆయన తనకంటూ ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారు.. ఆర్మీలో చేరాలని.. సైన్యంలో చేరి సేవలందించాలనే తపన ఉన్నప్పటికీ.. పెద్ద పెద్ద శిక్షణ సంస్థల్లో చేరి తర్ఫీదు పొందే అవకాశం లేని ఎంతోమంది పేద, మధ్యతరగతి యువకులు ఇప్పుడు ఆర్మీ గోవింద్ వద్ద ఉచితంగా శిక్షణ పొందుతున్నారు.

2017 నుంచి శిక్షణ

2017 నుంచి ఇటువంటి వారికి గోవింద్ శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా పలువురు యువకులు ప్రస్తుతం ఆర్మీ, నేవీలో పని చేస్తున్నారు. తన దగ్గరకు వచ్చిన యువకులకు ముందుగా ఆయన దేశభక్తిని పెంపొందించే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. అనంతరం వారితో శరీర దృఢత్వం కోసం వివిధ రకాల కసరత్తులు చేయిస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఆదర్శగ్రౌండ్‌లో తర్ఫీదు ఇస్తున్నారు. అక్కడకు వచ్చిన యువతకు పరుగుతోపాటు లాంగ్ జంప్, హైజంప్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ సమయానికి వారిని తీర్చిదిద్దుతున్నారు.


ఆర్మీ శిక్షణలోని యువతతో గోవింద్

దేశ రక్షణలో భాగస్వామ్యం చేస్తున్నా



నేటి యువత చెడు మార్గంలో కాకుండా దేశ రక్షణకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ ఇస్తున్నా. లాభాపేక్ష లేకుండా పేద, మధ్యతరగతి వారిని గుర్తించి శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతున్నా. దీంతో తాను పుట్టి పెరిగిన గ్రామానికి కూడా విశేష సేవలందిస్తున్నా. ఇప్పటికే మండల పరిధిలోని పలు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించా. స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాల్లోనూ యువతను భాగస్వాములను చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.

– గోవిందరావు, మాజీ సైనికుడు


కల నెరవేరింది



దేశ రక్షణలో సైనికుడిలా సేవలందించాలనేది నా కల. పేద కుటుంబం కావడంతో ఆర్థిక ఇబ్బందులు వెంటాడేవి. గోవింద్ గారు ఉచితంగా శిక్షణ ఇచ్చారు. దీంతో ఆర్మీలో ఉద్యోగం సాధించాను. నా కల నెరవేర్చుకున్నాను.

– జానకీ కృష్ణ, ఆర్మీ ఉద్యోగి


స్ఫూర్తి నింపారు



ఆర్మీ గోవింద్ గారిని చూసి రక్షణ రంగంలోకి వెళ్లాలనుకున్నా. దానిపై పూర్తిగా పట్టు సాధించేలా కఠోరంగా శిక్షణ ఇచ్చారు. నాలో స్ఫూర్తి నింపారు. రోజూ ఉదయం సాయంత్రం క్రమం తప్పకుండా శిక్షణ పొందాను. నేవీలో ఉద్యోగం సంపాదించుకున్నాను.

– మరిడి వశిష్ఠ, నేవీ ఉద్యోగి

రుణపడి ఉంటా



గోవింద్ గారికి రుణపడి ఉంటా. నేను ఆర్మీలో ఉద్యోగం సాధించడానికి ఆయన ఇచ్చిన శిక్షణే కారణం. దేశ రక్షణలో నేను ఒక సైనికుడినయ్యా. చాలా గర్వంగా ఉంది. ఆయన శిక్షణలో ఎంతో మంది ఉద్యోగాలు పొందారు.

– టి.అశోక్, ఆర్మీ ఉద్యోగి

క్లుప్తంగా

సంక్షేమ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్

డుంబ్రిగుడ: మండలంలోని 18 పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్ అన్నారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు సంతవలస గ్రామంలో పార్టీ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. పార్టీ కన్వీనర్‌లతో సమావేశాలు ఏర్పాటు చేసి, గ్రామాల్లో సమస్యలను తెలుసుకొని, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.అనంతరం డుంబ్రిగుడ , సంతవలస గ్రామాల్లో లబ్ధిదారులకు ప్రభుత్వం కల్పించిన బియ్యాన్ని ఆయన అందజేశారు. రేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోతంగి సర్పంచ్ వెంకటరావు, ఉప సర్పంచ్ జగ్గునాయుడు, నాయకులు శ్రీరాములు, సింహాచలం సద్దు, మొద్దు ,త్రినాథ్ పాల్గొన్నారు.

పసుపు యంత్రాల పంపిణీ



యంత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పుష్పలత

చింతపల్లి: గిరిజన రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న పసుపు యంత్రాలు సద్వినియోగం చేసుకోవాలని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత అన్నారు. మండలంలోని చిన్నగడ్డ, కందులగాది, మల్లవరం, గడపరాయి గ్రామాల్లో పసుపు ఉడకబెట్టే యంత్రాలను ఆమె రైతులకు అందజేశారు. ఐటీడీఏ సహకారంతో ఈ యంత్రాలను ఉచితంగా అందజేస్తోందన్నారు. యంత్రాల వినియోగం వల్ల పసుపు నాణ్యత మెరుగు పడుతుందని చెప్పారు.విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్ చంద్రకళ, వలంటీర్లు పరమేశ్వరరావు, జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: రేవళ్ల పంచాయతీలో రేవళ్ల, నిమ్మలపాలెం, ఆర్.కంఠారంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో విజయకుమారి శనివారం సందర్శించారు. రికార్డులు, పిల్లల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంగన్‌వాడీ వర్కర్లకు సీడీపీవో విజయకుమారి ఆదేశించారు. ప్రతీ నెల పిల్లల బరువు, ఎత్తులు చూడాలని సూచించారు. సక్రంగా పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రీ స్కూల్‌లో భాగంగా పిల్లలకు సరైన విధంగా బోధించాలని సూచించారు.

గిరిజన నిరుద్యోగులను ఆదుకోవాలి

పాడేరు రూరల్ : జిల్లాలోని పాడేరు ఆర్టీసీ డిపోతో పాటు అరుకు ఆర్టీసీ బస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను నిరుద్యోగ గిరిజన యువతకు మాత్రమే లీజుకు ఇవ్వాలని , గిరిజనేతర వ్యక్తులకు లీజుకు కట్టబెడితే ఊరుకునేది లేదని గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కూడా రాధాకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజనేతర వ్యక్తులతో శనివారం ఆర్టీసీ డిపోలో లీజుకు సంబంధించి చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఈ విషయంపై కలెక్టర్, ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ స్పందించి గిరిజన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని, ఆర్టీసీ స్థలాలను లీజుకు ఇవ్వాలని కోరారు.

రేపటి నుంచి కొండగోకిరిలో 'గడప గడపకు'

కొయ్యూరు: కొండగోకిరి పంచాయతీలో ఈనెల 23 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు శనివారం తెలిపారు. మూడు రోజుల పాటు పంచాయతీలో జరిగే ఈ కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పాల్గొంటారని, పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

'గడప గడప'తో సమస్యల పరిష్కారం

- జీకే వీధి, అరకులోయ, గంగవరంలో గడప గడపలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి

గూడెంకొత్తవీధి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయని జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని రెండో రోజు శనివారం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పెదవలస, చాపరాతిపాలెం, బొంతువలస, పిల్లిగొంది, పెదలంక తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లోని 439 గడపలను ఆమె సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.

లోకేష్ పాదయాత్రతో ప్రయోజనం లేదు...

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మివిలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకుడు నారా లోకేష్ చేపడుతున్న పాదయాత్ర వల్ల ఆయనకు కాళ్లు పీకులు, ఒళ్లు నొప్పులు తప్పా ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. కేవలం ఉనికి కోసం తేదేపా, జనసేన నాయకులు ప్రాకులాడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అందిస్తున్న సుపరిపాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు, ఆరోపణలు చేసినా వాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రతిపక్షాలకు ప్రజలు మళ్లీ ఓటుతోనే బుద్ధిచెబుతారన్నారు.రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని స్పష్టం చేశారు. ఎంపీపీ బోయిన కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు శివరత్నం, మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ , ఏఎంసీ చైర్ పర్సన్ రాజులమ్మ, వైస్ చైర్మన్ ఇర్మియా, సర్పంచ్ కృష్ణారావు, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేవుడు, పీఏసీఎస్ చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్లు త్రిమూర్తులు, ఎంపీటీసీ సభ్యులు సత్యనారాయణ, నాగమణి, ఉప సర్పంచ్ కుమారి, నాయకులు బాలరాజు, అరుణ్, అంజి, రాము, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలపై బ్రోచర్‌ను గ్రామస్తులకు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

ఇంటింటికీ సంక్షేమం: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని మాదల పంచాయతీలో శనివారం మూడవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సరుబెడ, బట్టివలస, ముసిరిగుడ గ్రామల్లో 199 గడపలను ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల అభ్యున్నతి కోసం శ్రమిస్తున్నారన్నారు. గ్రామాల్లో సమస్యలను నేరుగా తనకు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎంపీపీ ఉషారాణి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధర్ స్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, ఎంపీటీసీ సభ్యుడు రామచందర్, నాయకులు రఘునాథ్, అప్పాలు, సన్యాసి, రామ్మూర్తి, సంపత్‌కుమార్, రంజిత్‌కుమార్, రమేష్, గోపాల్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో గడప గడపలో ఆనందం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గంగవరం: జగనన్న సంక్షేమ పథకాలతో ప్రతి గడప ఆనందంగా ఉందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. కొత్తాడ గ్రామ సచివాలయం పరిధిలో కొత్తాడ పునరావాస కాలనీ, ఎర్రంపాలెం, బోడివీధి గ్రామాల్లో సర్పంచ్ శారపు కామరాజుదొర ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గడప గడగపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయా గ్రామాల్ల 316 గడపలను ఎమ్మెల్యే ధనలక్ష్మి సందర్శించారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు.

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లడమే జగనన్న ధ్యేయమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మికి, ప్రజా ప్రతినిధులకు కొత్తాడ గిరిజనులు ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబిరత్నం, వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ ఎం.శ్రీమన్నారాయణ, కో-అప్షన్ సభ్యుడు కెఎస్.ప్రభాకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జువెంకటేశ్వరరావు, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ పండా సిద్దార్థ, వైఎస్సార్ సీపీ అరకు పార్లమెంట్ కార్యదర్శులు ఏడుకొండలు, దిండి బాబి, సర్పంచ్‌లు బి.శివ, రామలక్ష్మి, రమణమ్మ, ఎస్.మరిడమ్మ, కె.సుబ్బలక్ష్మి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఎం.శ్రీను, ఎంఎంఎస్ అధ్యక్షురాలు పావని, కొత్తాడ మాజీ సర్పంచ్ సంకురుదొర, సింగారమ్మ, కార్యదర్శి అజయ్, వీఆర్వో రాజామణి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పాడేరు రూరల్ : ఇంటింటికీ అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ లీలా ప్రసాద్ అన్నారు. మండలంలోని మినుములూరు పీహెచ్‌సీ పరిధిలో పాత పాడేరు గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను ఆయన పరిశీలించారు. పి.గొందూరు కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులకు మెరుగైన పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఇరడాపల్లి గ్రామ సచివాలయం పరిధి బొక్కెళ్ళు అంగన్‌వాడీ కేంద్రంతో పాటు రాయిగెడ్డ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అక్కడి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి వైద్య చికిత్సలు కల్పించాలని, ఐరన్ మాత్రలు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, గోపాలకృష్ణ, ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణాధికారి గుల్లేలి సింహాద్రి, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, తదితరులున్నారు.



పాత పాడేరులో ఫ్యామిలీ డాక్టర్ సేవలను పరిశీలిస్తున్న ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్

ముర్లవానిపాలెంలో వైద్య శిబిరం

రాజవొమ్మంగి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముర్లవానిపాలెంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. రాజవొమ్మంగి పీహెచ్‌సీ వైద్యాధికారి లిఖిత, 104 డాక్టర్ నాగార్జున ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. సుమారు 35 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేసినట్టు చెప్పారు. శ్రీనివాస్, కృష్ణవేణి, భవానీ, ఎంపీహెచ్ఈఓ నాగవాసు, హెల్త్‌అ సిస్టెంట్ లక్ష్మణ్, ఆశ తదితరులు వైద్య సేవలందించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: మాదల పంచాయతీ ముసిరిగూడ గ్రామనికి చెందిన కొర్రా సీతమ్మ (72), బట్టివలస గ్రామనికి చెందిన సివేరి భగత్‌రాం(60) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆయా గ్రామాలకు వెళ్లి భౌతిక దేహాలను సందర్శించి, నివాళులర్పించారు. దహన సంస్కారాలకు ఆర్థిక సాయమందించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం అందేలా కృషి చేస్తానని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగధర్‌స్వామి, ఎంపీపీ ఉషారాణి, నాయకులు ఉన్నారు.

హుకుంపేట: శోభకోట పంచాయతీ సంపంగిపుట్టులో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శనివారం పర్యటించారు. గ్రామంలో మాజీ సర్పంచ్ రేగం సన్యాసి తండ్రి తెల్లన్న అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాల్గుణ స్థానిక నాయకులతో కలిసి గ్రామంలోని తెల్లన్న భౌతిక దేహం వద్ద నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, మండల పార్టీ అధ్యక్షుడు కొండబాబు, సొసైటీ బ్యాంకు చైర్మెన్ రామకృష్ణ, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నాగరాజు, సర్పంచ్‌లు బొంజుబాబు, సింహాచలం, నాయకులు సాంబ, వెంకట్ తదితరులున్నారు.



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

మృతురాలి కుటుంబానికి పరామర్శ

డుంబ్రిగుడ: కోల్లాపుట్టు పంచాయతీ మాజీ సర్పంచ్ కొర్రా జమున అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు శనివారం నాయకులతో కలిసి మృతురాలి స్వగ్రామం చంపగుడలో సందర్శించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. నాయకులు చిన్నారావు, భాస్కర్ రావు, కాసులమ్మ, ప్రకాష్, పరశురాం, రాంనాయుడు, ఎంఈవో త్రినాథరావు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు

రేపటి నుంచి సామాజిక తనిఖీలు

కొయ్యూరు: స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ బడుగు రమేష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వలసల నివారించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు కూలీలకు వరంగా మారిందన్నారు. వేలాది మందికి ఈ పథకం పనిని కల్పిస్తోందన్నారు. 2020-21 ,2021-22కి సంబంధించి రూ.54 కోట్ల తో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలను నిర్వహించనున్నట్టు చెప్పారు. సర్వేను నిజాయితీగా చేయాలన్నారు. పంచాయతీలలో నిర్వహించే గ్రామసభల సమాచారం విధిగా సర్పంచ్‌లకు తెలిపి వారి సమక్షంలో పనులు నిర్వహించాలన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్

ఎస్ఆర్‌పీ సీహెచ్ సత్యనారాయణ మాట్లాడుతూ పనులు జరిగిన ప్రాంతానికి వెళ్లి అక్కడ పనిచేసిన కూలీలను విచారించి పని జరిగిందో లేదో నిర్ధారిస్తామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పనులు జరిగిన వాటిని పరిశీలిస్తామన్నారు. ఎంపీడీవో మేరీరోజ్, ఏపీవో రాజు, వీఆర్‌పీలు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఒకటి నుంచి క్రికెట్ టోర్నీ

రంపచోడవరం: మండలంలోని గెద్దాడలో అనంతచక్రరావు, మంగతాయారు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫిబ్రవరి 1వ తేదీన నిర్వహిస్తున్నట్టు పత్రి హర్షకిరణ్ తెలిపారు. దారగూడెం యూత్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 మండలాల్లోని క్రికెట్ టీములు టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ నెల 28లోగా ఎంట్రీ ఫీజు రూ. 800 చెల్లించాలన్నారు. పోటీల్లో పాల్గొనే టీమ్ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మ్యాచ్‌లక సంబంధించి 29తేదీ డ్రా తీయనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 8639743332 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన

గూడెంకొత్తవీధి: జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న గిరిజనులకు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందిస్తామని పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్ అన్నారు. కృష్ణదేవీపేట నుంచి చాపరాతిపాలెం మీదుగా పెదవలస, రింతాడ చింతపల్లి వైపు జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. రహదారి విస్తరణ వల్ల భూములు కోల్పోతున్న గిరిజనులతో ఆయన మాట్లాడారు. భూమి కోల్పోతున్న ప్రతి గిరిజనుడికి వారి వద్ద ఉన్న పట్టాల ఆధారంగా నష్టపరిహారం అందిస్తామన్నారు. ఈ మేరకు ప్రత్యేకంగా గిరిజనుల నుంచీ ఈ కేవైసీ నమోదు చేసి వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోనే నష్టపరిహారం జమ అయ్యేలా చూస్తామన్నారు. గిరిజనులు ఈ విషయంలో ఎటువంటి ఆందోళన పడొద్దన్నారు. జాతీయ రహదారి వల్ల ఈ ప్రాంతం అన్ని రకాలుగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా గిరిజనులు పండించే వ్యవసాయ , ఉద్యాన ఉత్పత్తులకు తగిన మార్కెటింగ్ రవాణా సదుపాయాలు కలుగుతాయన్నారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో కూడా సబ్‌కలెక్టర్ జాతీయ రహదారి నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో తిరిగి గిరిజనుల భూములను పరిశీలించారు. సర్వే పనులపై ఆరా తీశారు. తహసీల్దారు రాజ్ కుమార్, సర్వేయర్ శ్రీను, వీఆర్వో భవానీ, గ్రామసర్వేయర్ నాగేష్, ఎన్‌హెచ్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్

సక్రమంగా పౌష్టికాహారం అందించాలి

వీఆర్ పురం: అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు పూర్తి స్థాయిలో పౌష్టికాహారం అందించాలని స్త్రీశిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏ.సిరి అన్నారు.మండలంలోని గుండుగుడెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శనివారం తనిఖీ చేశారు. కేంద్రంలోని ఆహార పదార్థాలను ఆమె పరిశీలించారు. గ్రామంలోని తల్లులు, బాలింతలకు ఆరోగ్య భద్రపై అవగాహన కల్పించారు. అనంతరం కుందులూరులో అంగన్‌వాడీ వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీడీపీవో విమల, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



పౌష్టికాహార పదార్థాలను పరిశీలిస్తున్న స్త్రీశిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సిరి

ఎస్టీ ధ్రువపత్రాల కోసం వినతి

చింతూరు: ఎస్టీ సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని చింతూరు మండలం ఒడియా క్యాంపు, పొల్లూరు, ఇంతులూరువాగు, మోతుగూడెంతో పాటు ఇతర గ్రామాల ఆదివాసీ ప్రతినిధులు శనివారం విశాఖపట్నంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా జీవిస్తున్నామని, ఓటర్, ఆధార్, రేషన్ కార్డులున్నా ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని తమకు ఎస్టీ ధృవీకరణ పత్రాలు వచ్చేలా చూడాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.



ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబుకు వినతిపత్రం అందచేస్తున్న ఆదివాసీ నాయకులు

లంపీ వ్యాక్సినేషన్ వేగవంతం

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో సిబ్బందితో పశు వైద్యాధికారి గౌతమ్ శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. లంపీ వ్యాధి వ్యాక్సినేషన్ వేగవంతం చేయాలని ఆదేశించారు. సిబ్బంది అనురాధ, సుబ్బారావు, త్రినాథరావు, జానకి, అనంత్‌రావు, సంజీవ్ పాల్గొన్నారు.

శివరాత్రి వేడుక అధికారికంగా నిర్వహించాలి

అనంతగిరి: బొర్రాగుహల వద్ద ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని, బొర్రా యూనిట్ మేనేజర్ గౌరీశంకర్‌కు సర్పంచ్ అప్పారావు, వార్డు సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు. ఉత్సవానికి భారీగా భక్తులు తరలివస్తారని, అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చింతపల్లి రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీడీవో లాలం సీతయ్య అన్నారు. లంబసింగి పంచాయతీ లబ్బంగి గ్రామానికి చెందిన పాంగి భిమలకు వైఎస్సార్ చేయూత పథకం అందలేదని ఫిర్యాదు మెరకు శనివారం విచారణ నిర్వహించారు. ఆమె రేషన్ కార్డులో ఆధార్ నంబరు తప్పుగా నమోదు కావడం వల్ల పథకం అందలేదని చెప్పారు. ఆమె ఇటీవల స్పందన కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు విచారణ నిర్వహించగా రేషన్ కార్డులో ఆధార్ నంబరు తప్పుగా నమోదైనట్టు గుర్తించామని, పథకం వర్తింప చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోంటామన్నారు.

ఫేస్ అటెండెన్స్ నుంచి మినహాయించాలి

డుంబ్రిగుడ: వైద్య ఆరోగ్య శాఖ క్షేత్రస్థాయి సిబ్బందికి ఫేస్ అటెండెన్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీఎంఈ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జానకి, సావిత్రి కోరారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీలో పనిచేస్తున్న ఆరోగ్య శాఖ క్షేత్రస్థాయి సిబ్బందికి ఫేస్ అటెండెన్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, విధుల్లో భాగంగా సిగ్నల్ వ్యవస్థ లేని ప్రాంతాల్లో వెళ్లాల్సి ఉంటుందని, ఆ సమయంలో ఫేస్ అటెండెన్స్‌కు ఇబ్బందులు తప్పవన్నారు. యంత్రాంగం స్పందించాలని కోరారు.

టబ్బులు పంపిణీ

పాడేరు రూరల్ : బర్సింగి పంచాయతీ కొత్తవూరులో గిరిజన రైతులకు ఎస్‌వీఎం ఫార్మర్ ప్రొడ్యుసర్ సంస్థ ప్రతినిధులు ఉచితంగా ఇరిగేషన్ టబ్బులను పంపిణి చేశారు. టబ్బులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ సీఈవో కుర్రబోయిన సింహాచలం తెలిపారు. ఎస్‌వీఎం ఫార్మర్ ప్రొడ్యుసర్ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.విశ్వనాథం, జనరల్ మేనేజర్ కె.రమేష్ పాల్గొన్నారు.

వలంటీర్ మానవత్వం



గోతిలో పడిన ఆవును జేసీబీ సాయంతో బయటకు తీయిస్తున్న గ్రామ వలంటీరు సాయిపవన్

గూడెంకొత్తవీధి: నోరు లేని మూగజీవం అది చీకట్లో దారి కనిపించక రెండు రోజుల కిందట గూడెంకొత్తవీధి గ్రామంలోని ఓ ఇంటి కోసం తవ్విన మరుగుదొడ్డి గోతిలో పడిపోయింది. బయటకు రాలేని పరిస్థితి గోతులో ఇరుక్కుపోయి రెండు రోజులుగా ఆర్తనాదాలు పెడుతోంది. దాని అవస్థలు చూసి స్థానికులు చలించిపోయారు. గ్రామ వలంటీరు సాయిపవన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో వలంటీరు చొరవ తీసుకున్నారు. ఎలాగైనా మూగజీవాన్ని కాపాడాలని నిర్ణయించుకుని జేసీబీని రప్పించారు. దుక్కిటెద్దుకు ఎటువంటి హానీ కలగకుండా గోతిలో మట్టిని జాగ్రత్తగా తొలగించి ఆ ఎద్దును బయటకు తీసుకువచ్చారు. ఇందుకోసం వలంటీరు సహా స్థానికులు సుమారు రెండు గంటలపాటు శ్రమించారు. నూతులు గ్రామానికి చెందిన కాకురు లక్ష్మయ్య దుక్కిటెద్దు ఖరీదు సుమారు రూ.20వేల వరకూ ఉంటుంది. వ్యవసాయానికి చేదోడుగా ఉండే తమ దుక్కిటెద్దును ప్రాణాలతో బయటకు తీసినందుకు యజమాని సహా గ్రామస్తులంతా వలంటీరు సాయి పవన్‌ను అభినందించారు.

బాధిత కుటుంబానికి సాయం



ఆర్థిక సాయమందిస్తున్న గ్రామస్తులు

ముంచంగిపుట్టు: కష్టంలోనూ మేమున్నామంటూ భరోసా కల్పించారు సుజనకోట గ్రామ గిరిజనులు. ఎవరికి తోచింది వారికి అందిస్తూ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు పూర్తిగా దగ్ధమై సర్వం కోల్పోయిన మండి బాపన్న కుటుంబానికి అండగా నిలుచున్నారు. శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో సుజనకోటలో మండి బాపన్న అనే గిరిజనుడి ఇల్లు దగ్ధమైన విషయం తెలిసిందే. బాపన్న కుటుంబానికి ఆదుకోవాలని సుజనకోట గ్రామ గిరిజనులు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు పాఠశాల కాలనీవాసులు సేకరించిన విరాళం రూ.1100 , 22 కిలోల బియ్యం అందించారు. అలాగే సుజనకోట గ్రామస్తులు సేకరించిన రూ.2200 నగదుతో పాటు 60 కిలోల బియ్యం అందించారు. సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్, జోలాపుట్టు సర్పంచ్ నీలకంఠం, ఎంపీటీసీ సభ్యురాలు కమల, నాయకులు తిరుపతి, అప్పారావు, సాధురాం సైతం బియ్యం, దుస్తులు, కూరగాయలు తదితర సామగ్రిని అందించారు. మండల గిరిజన విలేకరుల సంఘం తరఫున సైతం ఆర్థిక సహాయం అందించారు. దాతలందరికీ బాధితుడు బాపన్న కృతజ్ఞతలు తెలియజేశారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతికి సంతాపం



రాజామణి(ఫైల్)

అడ్డతీగల: పులిగోగులపాడులో అంగన్‌వాడీ వర్కర్‌గా పనిచేస్తున్న చందుర్తి రాజామణి(54) అనారోగ్యంతో కాకినాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతురాలు రాజామణి కుమారుడు దుర్గాప్రసాద్ పులిగోగులపాడు సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచి పనిచేస్తున్నారు. ఆమె భర్త బాబూరావు ఎఎస్ఐగా పనిచేస్తున్నారు. ఈమె మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



రోడ్డుపై మహిళ మృతదేహం

మల్కన్‌గిరి: చిత్రకొండ సమితి దొరగూడ-పప్పులూర్ ప్రధాన రహదారిలో అనుమానాస్పదంగా మృతి చెంది ఉండడంతో పోలీసులకు స్థానికులు సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతురాలి వివరాల కోసం ఆరా తీశారు. శుక్రవారం రాత్రి ఎవరో మహిళ గొంతు కోసి హత్య చేసి, రోడ్డు పక్కన పడవేసినట్టు గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులు ఎవరైనా సంప్రదిస్తే అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

డాబా.. మేడ.. మిద్దె.. పేరేదైనా.. ప్రతి ఒక్కరి జీవితంలో దీనితో అనుబంధం ఉంటుంది. చిన్నప్పుడు అమ్మ డాబాపై నుంచి చందమామను చూపిస్తూ గోరుముద్దలు తినిపించడం .. డాబాపై పరుగెత్తుతూ గాలి పటాలు ఎగరేసిన క్షణాలు ఎవ్వరూ మర్చిపోరు. నిండు వెన్నెల్లో.. చల్లని పైరుగాలి తాకుతుంటే.. డాబాపై కూర్చొని.. కుటుంబమంతా కబుర్లతో కాలక్షేపం చేస్తూ మునిగిపోయిన రోజులెన్నో.. ఇలా చెప్పుకుంటూ పోతే డాబాతో పెనవేసుకున్న బంధాలు ఎవర్‌గ్రీన్. ఆ మధురమైన జ్ఞాపకాలను పదిలపరుచుకుంటూ.. నగరంలో చాలా మంది తమ మిద్దెలను వ్యవసాయ క్షేత్రాలుగా మార్చి సేద్యం చేస్తున్నారు. మేడను.. ఇంటి ఆవరణలోని ఖాళీ ప్రదేశాల్లో తమకు అవసరమైన కూరగాయల సాగు ప్రారంభించి.. ఒత్తిడిని దూరం చేసుకుంటూ ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. పచ్చని పూల వనాలతో.. కూరగాయల తోటలతో ఆ గృహాలు నందనవనంలా మురిపిస్తున్నాయి.

రావు గారి ఇంట.. ఆరోగ్యాల పంట

- ఇంటి మిద్దెపై కూరగాయల సాగు
- విశ్రాంత ఉద్యోగ దంపతుల ఆదర్శం

ఏయూక్యాంపస్: ఎంవీపీకాలనీలో నివాసం ఉంటున్న కె.ఎం.రావు, లలిత దంపతులు ప్రభుత్వ శాఖల్లో పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. మొదట్లో ఇంటి ఆవరణలోని కొద్దిపాటి ఖాళీ స్థలంలో సరదాగా పువ్వుల మొక్కలు, ఆనప, కాకర వంటి పాదులు వేశారు. తర్వాత కాలంలో పూర్తిగా డాబాను మిద్దెతోట ఏర్పాటుకు కేటాయించారు. ఎనిమిదేళ్లుగా వీరు కూరలు పండిస్తూ అందరికీ పంచిపెడుతున్నారు. ఇందుకోసం రెండు అంతస్తుల్లో మొక్కలు పెంచడానికి అవసరమైన కుండీలను ప్రత్యేకంగా నిర్మించుకున్నారు. రెండంతస్తుల్లో ఉన్న ఖాళీ జాగాన్ని పూర్తిగా ఆకుకూరలు, కూరగాయలు పెంపకానికి వినియోగిస్తున్నారు.

ఇంటికి సరిపడే కూరలు

ప్రస్తుతం వీరి మేడ మీద పొట్ల, దొండ, కాకర, బీర, వంగ, బెండ, టమాటా, మిరప, ఆనప, చిక్కుడు వంటి కూరలు సాగు చేస్తున్నారు. వీటితో పాటు పాలకూర, కరివేపాకు, చుక్కకూర, తోటకూర, కొత్తిమీర వంటి ఆకుకూరలు పండిస్తున్నారు. మేడ మీద కుండీలో వేసిన నిమ్మ మొక్క ఏపుగా పెరగడంతో పాటు నిండుగా కాయలతో దర్శనమిస్తోంది. అంజీర, డ్రాగన్ ఫ్రూట్ వంటివి ఇక్కడ పండిస్తున్నారు. ఆహ్లాదాన్ని పంచే పూల మొక్కలు పదుల సంఖ్యలో ఇక్కడ కనువిందు చేస్తున్నాయి. సీజన్‌కు తగ్గట్టుగా విభిన్న రంగుల పువ్వులు ఇక్కడ దర్శనమిస్తున్నాయి.


కె.ఎం.రావు ఇంటిపై విస్తరించిన మిద్దెతోట

సేంద్రియ విధానంలో..

వీరు మిద్దె పంటలన్నీ పూర్తిగా సేంద్రియ విధానంలో సాగు చేస్తున్నారు. దేశీయ ఆవు పేడ, జీవామృతం, సహజ జీవ ఎరువులు వినియోగిస్తున్నారు. స్వయంగా జీవామృతం తయారు చేసుకుంటున్నారు. పంటలకు ఎటువంటి చీడ పీడలు వచ్చినా సేంద్రియ విధానాలతో చికిత్స చేస్తున్నారు.


సిద్ధమైన ముల్లంగా పంట

గోసేవ.. నిత్యకృత్యం

గోసేవ చేయడం అలవాటుగా మార్చుకున్నారు. నిత్యం తమ ఇంటి వద్దకు వచ్చే ఆవులకు ఆహారం అందిస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో నాన పెట్టిన మినప, పెసర, గోధుమ పొట్టును గోవులకు పెట్టడం వీరి దినచర్యలో భాగంగా మారిపోయింది. ఈ గోవులకు వీరు ముద్దుగా పిల్లలొచ్చారు అంటూ సంబోధిస్తూ ప్రేమగా చూస్తున్నారు. ఉదయం వేళలో యోగా సాధన చేయడం, తర్వాత గోసేవ, సాయంత్రం వేళల్లో ప్రకృతి మధ్యలో మొక్కలతో గడపడం వీరికి నిత్య కృత్యం. ప్రకృతికి దగ్గరగా జీవించడం అలవాటు చేసుకున్న వీరి ఇంటికి నిత్యం పక్షులు, ఉడతలు, రామచిలుకలు వస్తుంటాయి. వీటికి ఆహారం అందించడం అలవాటుగా మార్చుకున్నారీ దంపతులు.

కోవిడ్ సమయంలో సంజీవని

కోవిడ్ విపత్తు సమయంలో మిద్దెతోటలో పండించిన కూరగాయలతో కె.ఎం.రావు, లలిత దంపతులు ఆనందగా గడిపేశారు. బయట మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనాల్సిన అవసరం లేకుండా.. కోవిడ్ బారిన పడకుండా మిద్దెతోట ఎంతగానో ఉపకరించింది.


కాయలతో అంజీరా మొక్క

ఇల్లే వనం.. ఆనందమయం

- 15 ఏళ్లుగా సేద్యం చేస్తున్న లీలావతి
- సొంతంగా ఎరువుల తయారీ




కాలీఫ్లవర్ మొక్క, విరగ్గాసిన చిక్కుడు కాయలు, సీజనల్ ఫ్లవర్

మురళీనగర్(విశాఖ ఉత్తర): అయ్యప్పనగర్‌కు చెందిన అనిశెట్టి లీలావతి తన ఇంటి పరిసరాలు, ఇంటి మిద్దెను వ్యవసాయ క్షేత్రంగా మార్చి.. కూరగాయల సేద్యం చేస్తున్నారు. ఎన్నో రకాల కూరలు, పండ్లు, పూలు, పూజా సామగ్రికి ఉపయోగపడే పత్రులు పెంచుతూ.. ఇంటినే ఒక వనంగా మార్చేశారు. సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తూ.. ఆరోగ్యాన్ని, మానసిక ఆనందాన్ని పొందుతున్నారు. ఆమె ఇంటికి వెళ్తే ఆత్మీయంగా స్వాగతం పలికి.. మంచి కాఫీతో పాటు కూరగాయలను బహుమతిగా అందిస్తారు.

బీట వేసిందా.. విత్తనం వేయాల్సిందే..

పూలకుండీ.. గోనె సంచీ.. గోడ సందు.. గచ్చు పగుళ్లు.. ఏదీ మొక్క పెంపకానికి అనర్హం కాదు.. మనసు పెట్టి చేస్తే.. మొక్క మొలిచి చూపుతుంది అని అంటున్నారు లీలావతి. ఆమె భర్త నేవల్ డాక్‌యార్డు విశ్రాంత ఉద్యోగి బాబూ రాజేంద్రప్రసాద్‌తో కలిసి అయ్యప్పనగర్(మురళీనగర్ ఈస్ట్)లో 1985 నుంచి నివసిస్తున్నారు. ఆమె 15 ఏళ్లుగా మిద్దెపై సేద్యం చేస్తున్నారు. కరోనా రెండేళ్ల కాలంలో తను పండించిన కూరగాయలు తమ అవసరాలకు సరిపోతూ.. చుట్టు పక్కల వారికి అందించినట్లు లీలావతి చెప్పారు. సాధారణంగా ఇంటి గచ్చులు, ప్రహరీ పగుళ్లు వస్తే ఆందోళన చెంది వాటి మరమ్మతులకు నానా హైరానా పడిపోతాం. కానీ లీలావతి ఆ పగుళ్లను క్రీపర్స్ విత్తనాలను నాటేందుకు అనుకూలంగా మారుస్తారు. చిన్న రంధ్రం కనిపిస్తే అందులో ఒక మొక్కను నాటుతారు. ప్రహరీల మధ్య సందులో మట్టిలోకి విత్తనాలను పంపి పెంచుతారు. పాడైన బకెట్లు, పాత సామాన్ల షాపు వద్ద వాటర్ టిన్లు కొనుగోలు చేసి.. వాటిని సైజు చేసి అందులో మొక్కలు వేస్తారు. తవ్వకాల సమయంలో మట్టిని సేకరించి నిల్వ చేస్తారు. గోడల ఇరుకు సందుల్లో పాదులు వేసి వాటిని మేడ పైకి పాకిస్తారు.


మిద్దె గోడపై పూలమొక్కలు

అతి తక్కువ ఖర్చుతో ఇంటి పంటలు

అతి తక్కువ ఖర్చుతో ఆమె పంటలు పంటలు పండిస్తున్నారు. చాలా మంది వర్మీ కంపోస్టు, బోన్ మీల్, కోకో పిట్‌ను మిద్దె పంటలకు వాడతారు. ఆమె మాత్రం ఎండుటాకులు, వంట గదిలోని పనికిరాని మెటీరియల్, బియ్యం, పప్పులు కడిగిన నీరు ఎరువులుగా ఉపయోగిస్తారు. ఆవు గెత్తం రూ.100కు రెండు మూటలు కొంటారు. ఇది నెల రోజులకు సరిపోతుంది. పుల్లని మజ్జిగ, కాయగూరల తొక్కలు, పండ్లు తొక్కలతో వర్మీ కంపోస్టు తయారు చేస్తారు. టీ దుకాణాల్లో వాడేసిన టీ పొడిని ఎరువుగా వినియోగిస్తారు.

ప(పె)ంచడంలో ఆనందం



సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలే తింటున్నాం. ఇంటి వచ్చిన వారికి కూరగాయలు బహుమతిగా ఇస్తాను. ఇలా పంచడంలో ఎంతో ఆనందం ఉంది. మా ఇరుగు పొరుగు వారికి కూరగాయలు ఇస్తుంటాను. మా పాప లక్ష్మీసౌజన్యకు మొక్కలపెంపకం అంటే ఇష్టం. ఆమె హైదరాబాద్‌లో కుండీల్లో పండిస్తుంది. డబ్బు ఎక్కువగా ఖర్చుపెడుతుంది. అరటి తొక్కల రసం, కాలం తీరిన కాల్షియం ట్యాబ్లెట్లు మొక్కల మొదళ్లలో వేస్తాను. పురుగు నివారణకు పుల్లని మజ్జిగ, పొయ్యి బూడిత, పసుపు నీరు ఉపయోగిస్తాను. మొక్క ఎదుగుదల బాగుంటుంది. ఫిబ్రవరి నుంచి ఆగస్టు వరకు మల్లె పూలు పూస్తాయి. వీటిని మాలలుగా కట్టి వైభవ వేంకటేశ్వరస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాలకు అందిస్తాను.

– అనిశెట్టి లీలావతి

క్లుప్తంగా

నగరానికి కోవీషీల్డ్ టీకా

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : కోవిడ్ నియంత్రణ కోసం వినియోగించే కోవీషీల్డ్ టీకా మందు విశాఖ చేరుకుంది. ఉమ్మడి విశాఖ కోసం మొత్తం 45 వేల (టెన్ డోస్ వైల్స్) ఇంజెక్షన్లు వచ్చాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. విశాఖ జిల్లాకు 20 వేలు వైల్స్, అనకాపల్లి జిల్లాకు 20 వేలు వైల్స్, అల్లూరి సీతారామరాజు జిల్లాకు అయిదు వేలు వైల్స్ చొప్పున కేటాయించారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని త్వరలో ఇస్తామని ఆయన తెలిపారు.

న్యాయవాది విజయకుమార్ మృతి



విశాఖ లీగల్: నగరానికి చెందిన న్యాయవాది నల్లబిల్లి విజయకుమార్(58) శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. విజయకుమార్ ప్రస్తుతం విశాఖ న్యాయవాదుల గ్రంథాలయ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. జూనియర్ న్యాయవాదులను నిరంతరం ప్రోత్సహించే విజయకుమార్ మృతి దురదృష్టకరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి అన్నారు. విజయకుమార్ మృతి అసోసియేషన్‌కు తీరని లోటని న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.రవీంద్ర ప్రసాద్, వై.వేణుగోపాల్, బార్‌కౌన్సిల్ ఉపాధ్యక్షుడు రామ జోగేశ్వరరావు, సభ్యులు సీనియర్ న్యాయవాదులు ఎస్.కృష్ణమోహన్, పి.నరసింగరావు, బైపా అరుణ్ కుమార్‌తో సహా పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

26 నుంచి ప్లాస్టిక్ బ్యానర్ల నిషేధం


మాట్లాడుతున్న సన్యాసిరావు

డాబాగార్డెన్స్: నగరంలో ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్ బ్యానర్లు నిషేధిస్తున్నట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు స్పష్టం చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, ఫ్లెక్సీ ప్రింటింగ్ వ్యాపారస్తులు, వారి ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నగరంలో ప్లాస్టిక్ బ్యానర్లు నిషేధిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 26 నుంచి ఫ్లెక్సీ దుకాణదారులు ప్రత్యామ్నాయ మార్గమైన క్లాత్ బ్యానర్లను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డాక్టర్ ఎస్.కిశోర్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ శంకరరావు, ఫ్లెక్సీ బ్యానర్ల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

100% ఆక్యుపెన్సీతో వందేభారత్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ఎన్నో అంచనాలు.. అనేక పరీక్షల అనంతరం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య లాంఛనంగా ప్రారంభమైన వందేభారత్ ఎక్స్‌ప్రెస్.. 100 శాతం ఆక్యుపెన్సీతో రాకపోకలు సాగిస్తోంది. సంక్రాంతి రోజున సికింద్రాబాద్‌లో ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఈ రైలును ప్రారంభించగా.. సోమవారం నుంచి రెగ్యులర్ రైలుగా పట్టాలపై పరుగులు తీస్తోంది. మొదటిరోజు దాదాపు అన్ని స్టేషన్లలో హాల్ట్‌లు ఉండడం, ప్రారంభోత్సవం ఆలస్యం కావడంతో కొంత ఆలస్యంగా విశాఖపట్నం చేరుకున్నా.. మరుసటి రోజు నుంచి సమయానికి గమ్యస్థానానికి చేరుకుంటోంది.

వందేభారత్ రైలు గంటకు సగటున 110 నుంచి 130 కి.మీల వేగంతో విశాఖపట్నం–సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య ప్రయాణిస్తోంది. ప్రయాణికులు విశాఖపట్నం నుంచి కేవలం ఎనిమిదిన్నర గంటల్లోనే సికింద్రాబాద్ చేరుకుంటున్నారు. ఏ మాత్రం అలసట లేకుండా ఉండే సీటింగ్ సౌకర్యం, కోచ్‌ల లోపల ఆహ్లాదపరిచే ఇంటీరియర్, నాణ్యమైన అల్పాహారం, భోజనం, స్నాక్స్, వాటర్ బాటిల్స్ వంటి సదుపాయాలు(అన్ని టికెట్ ధరలోనే), తక్కువ సమయంలోనే ప్రయాణం ఈ రైలు ప్రత్యేకతలుగా నిలుస్తున్నాయి. ఆరు రోజులు ఇటు చెయిర్‌కార్ కోచ్‌లతో పాటు ఎగ్జిక్యూటివ్ కోచ్‌ల్లో పూర్తి ఆక్యుపెన్సీతో వందేభారత్ నడిచింది.


వందేభారత్ ఎక్స్‌ప్రెస్

విశాఖపట్నం–సికింద్రాబాద్ వందేభారత్‌లో మొత్తం 16 కోచ్‌లు, 1128 సీట్లు ఉన్నాయి. వీటిలో ఎగ్జిక్యూటివ్ కోచ్‌లో 104, చెయిర్‌కార్ కోచ్‌లో మొత్తం 1024 సీట్లు అందుబాటులో ఉండగా.. విశాఖపట్నం కోటా కిందట ఎగ్జిక్యూటివ్ కోచ్‌లో 57, చెయిర్‌కార్ కోచ్‌లో 627 సీట్లు రిజర్వేషన్‌కు అవకాశం కల్పించారు. ఆరు రోజులుగా ఈ రెండు క్లాస్‌లలో అన్ని సీట్లు నిండిపోయాయి. వచ్చే వారం కూడా దాదాపుగా ఎగ్జిక్యూటివ్ కోచ్‌లో సీట్లు ఫుల్ అయిపోయాయి. ఇప్పటికే వెయిటింగ్ లిస్ట్ కనిపిస్తోంది.

టికెట్ చార్జీలు ఇలా

చెయిర్‌కార్ టికెట్ ధర	రూ.1720
ఎగ్జిక్యూటివ్ చెయిర్ కార్	రూ.3,205

ఈ వారంలో విశాఖపట్నం నుంచి వందేభారత్ ఆక్యుపెన్సీ

తేదీ	ఎగ్జిక్యూటివ్ కోచ్	చెయిర్ కార్
16.01.2023	57/57	627/627
17.01.2023	57/57	627/627
18.01.2023	57/57	627/627
19.01.2023	57/57	627/627
20.01.2023	57/57	627/627
21.01.2023	57/57	627/627

అలరించిన 'అడ్వెంచర్ ఆఫ్ తార'


నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న కళాకారులు


విద్యార్థుల కేరింతలు


అడ్వెంచర్ ఆఫ్ తార నాటికలో ఓ సన్నివేశం

- ఆకట్టుకున్న పాత్రలు, వేషధారణలు
- నటనతో నవ్వులు పూయించిన మోనికా సంతోష్

ఎంవీపీకాలనీ: వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ప్రదర్శించిన 'అడ్వెంచర్ ఆఫ్ తార 'నాటిక చిన్నారులను అలరించింది. లిట్‌లాంటర్న్ ఫర్ కల్చర్ అండ్ లిటరేచర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఈ నాటికను ప్రదర్శించారు. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైజాగ్ థియేటర్ ఫెస్ట్ వేడుకల్లో భాగంగా పలు ప్రదర్శనలు జరిగాయి. తొలుత బాలీవుడ్ నటిగా ఎదగాలని ఆకాంక్షతో వచ్చిన యువతి పాత్రలో స్పానిస్ క్లౌన్ మోనికా సంతోష్ నటన చిన్నారుల్లో నవ్వులు పూయించింది. వేదికపై ఆమె మాటల గారడి, సాహసాలకు విద్యార్థులు కేరింతలు కొట్టారు. అనంతరం ప్రదర్శించిన అడ్వెంచర్ ఆఫ్ తార నాటిక మంత్రముగ్ధులను చేసింది. జంతువులు, పక్షుల సాయంతో ప్రజలు భూమిని సురక్షితంగా, అద్భుతమైన ప్రదేశంగా మార్చే ఇతివృత్తంతో ఈ నాటికను ప్రదర్శించారు.

ఇందులో భాగంగా తార కరుణామయ ప్రయాణం అందరినీ ఆకట్టుకుంది. తొలుత వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, కంకటాల మల్లిక్, లిట్‌లాంటర్న్ ఫర్ కల్చర్ అండ్ లిటరేచర్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్లు సోనాల్ సర్థా, ప్రియా ఉప్పలపాటి తదితరులు జ్యోతి వెలిగించి థియేటర్ ఫెస్ట్‌ను ప్రారంభించారు.

• అటు రైలు.. ఇటు పూలు!



అటు పక్క రంగుల రైలు.. ఇటు పక్క రంగు రంగుల పూలు.. నగరంలోని చావుల మదుం వద్ద ఈ సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. రైల్వే స్టేషన్ నుంచి యార్డుకు తరలించే క్రమంలో రైళ్లు చావులమదుం మీదుగా వెళ్తాయి. ఈ చావుల మదుం సమీపంలో రోడ్డు పక్కన పేపరు/ప్లాస్టిక్ పూల మొక్కలను విక్రయానికి ఉంచారు. చావుల మదుం మీదుగా వెళ్తున్న ఓ డబుల్ డెక్కర్ రైలు, దిగువన పూలు కాని పూల మొక్కలు.. ఈ రెండూ కాసేపు కనువిందు చేశాయి.

– సాక్షి ఫోటోగ్రాఫర్, విశాఖపట్నం

ఆల్‌రౌండ్ చాంపియన్‌గా విశాఖ

ముగిసిన అండర్–14, 17 రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరుగుతున్న 66వ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్–14, అండర్–17 బాలబాలికల పోరు ముగిసింది. అథ్లెటిక్స్ పోటీల ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్‌గా విశాఖపట్నం నిలిచింది. వ్యక్తిగత విభాగాల్లో అండర్–14 బాలుర విభాగంలో పి.సాయికిరణ్ (శ్రీకాకుళం) 777 పాయింట్లతో, బాలికల విభాగంలో పి.ప్రవల్లికారెడ్డి (విశాఖపట్నం) 710 పాయింట్లతో చాంపియన్లుగా నిలిచారు. అండర్–17 బాలుర విభాగంలో పి.రూబేష్‌బాబు (కృష్ణా) 773 పాయింట్లతో, బాలికల విభాగంలో పి.తిరీషా (విశాఖపట్నం) 812 పాయింట్లతో వ్యక్తిగత చాంపియన్లుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు శ్రీకాకుళం ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు పతకాలు, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆది, సోమవారాల్లో అండర్–19 విభాగంలో బాలబాలికలకు పోటీలు జరగనున్నాయి.

గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు తొలి అడుగు


ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు

- విజయవంతంగా ముగిసిన ఇన్ఫినిటీ వైజాగ్–2023
- విభిన్న అంశాలపై చర్చించిన ఐటీ నిపుణులు
- హాజరైన 60 సంస్థల ప్రతినిధులు
- రోడ్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించిన ఐటాప్

సాక్షి, విశాఖపట్నం : విశాఖ వేదికగా రెండు రోజుల పాటు జరిగిన ఇన్ఫినిటీ వైజాగ్ సమ్మిట్–2023 విజయవంతంగా ముగిసింది. దిగ్గజ సంస్థలకు చెందిన ఐటీ నిపుణుల చర్చలు.. ఆంధ్రప్రదేశ్, విశాఖలో ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు ఉన్న అవకాశాల విశ్లేషణలతో సదస్సు ఆద్యంతం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. కోవిడ్ పరిస్థితులు చక్కబడుతున్న నేపథ్యంలో వైజాగ్‌లో తమ సంస్థల శాఖలు విస్తరించేందుకు ఐటీ సంస్థలు ఆసక్తి చూపుతున్నట్లు ప్రకటించాయి. మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుకు బూస్టప్ అందించేలా జరిగిన ఐటీ సదస్సు కీలక అంశాలకు వేదికగా మారింది. తొలిరోజున 60 సంస్థల ఐటీ ప్రతినిధులు, 450 మందికి పైగా ఐటీ నిపుణులు, ఉద్యోగులు సదస్సుకు హాజరుకాగా.. రెండో రోజున 350 మందికి పైగా పాల్గొన్నారు. రెండో రోజున నిర్వహించిన కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ, డిజిటైజేషన్, ఐటీ పరిశ్రమలకు రోడ్‌మ్యాప్ మొదలైన అంశాలపై ప్యానెల్ డిస్కషన్స్ నిర్వహించారు. ముగింపు సమావేశంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎస్‌టీపీఐ డైరెక్టర్ సీవీడీ రామ్‌ప్రసాద్, రాష్ట్ర ప్రభుత్వ ఐటీ సలహాదారులు శ్రీనాథ్ దేవిరెడ్డి, చంద్రహాస్, రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఆర్‌టీ ఎఫైర్స్ సలహాదారు వెంకట్ మేడపాటి, ఎస్‌టీపీఐ ఏపీ అడిషనల్‌డైరెక్టర్ సురేష్ బాతా, ఐటాప్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు, ఐటాప్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ లక్ష్మి ముక్కవల్లి, పాల్గొన్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఐటీ సంస్థలకు చిరునామాగా వైజాగ్ అవతరించబోతోందని తెలిపారు. ఐటీ సంస్థలకు ఎలాంటి మౌలిక సదుపాయాలు, ల్యాండ్ బ్యాంక్ కావాలన్నా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారంతో పాటు ప్రోత్సాహకాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఐటాప్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు మాట్లాడుతూ రెండు రోజులు సదస్సులో వెల్లడైన కీలక అంశాలతో రోడ్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర విభజన తర్వాత టెక్నాలజికల్ పరంగా ఏ విధమైన ఆలోచనలు అమలు చేయాలి, నైపుణ్యాభివృద్ధి పెంచుతూ మానవ వనరుల్ని ఎలా అందుబాటులోకి తీసుకురావాలనే దానిపై కసరత్తు చేస్తామని శ్రీధర్ కొసరాజు తెలిపారు.

నేడు ప్రభుత్వంతో విప్రో ప్రతినిధులు

ప్రభుత్వంతో విప్రో ప్రతినిధులు ఆదివారం చర్చించనున్నారని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. త్వరలో ఐబీఎం ప్రతినిధులు కూడా చర్చలకు రానున్నారని పేర్కొన్నారు.

కోవిడ్‌తో ఐటీ పరిశ్రమల ఆలోచనల్లో మార్పులు

- వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు మొగ్గు చూపుతున్న ఉద్యోగులు
- ప్రపంచంలోని ఐటీ నిపుణుల్లో 20 శాతం మంది ఏపీకి చెందినవారే..
- ఏపీలోని ప్రతి గ్రామానికి ఫైబర్ కనెక్టివిటీ
- 'సాక్షి'తో రాష్ట్ర ప్రభుత్వ ఐటీ సలహాదారు దేవిరెడ్డి శ్రీనాథ్



సాక్షి, విశాఖపట్నం : కోవిడ్ కారణంగా తలెత్తిన పరిస్థితులు.. ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమల యాజమాన్యాల ఆలోచనల్లో ఎన్నో మార్పులు తీసుకొచ్చాయని రాష్ట్ర ప్రభుత్వ ఐటీ సలహాదారు దేవిరెడ్డి శ్రీధర్ అన్నారు. విశాఖలో నిర్వహించిన ఇన్ఫినిటీ వైజాగ్ సమ్మిట్–2022లో శనివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న డిజిటల్ సంస్కరణలు, భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌ని ఐటీ రంగంలో అగ్రగామిగా నిలబెడతాయని ధీమా వ్యక్తం చేశారు. ఇంకా ఏమన్నారంటే....

వర్క్‌ఫ్రమ్ హోమ్‌వైపు మొగ్గు

కోవిడ్ తర్వాత పరిస్థితులు నెమ్మదిగా మెరుగవుతున్నాయి. ఐటీ సంస్థల్లో 50 శాతం మంది ఉద్యోగులు ఇప్పటికీ ఇంటి వద్ద నుంచే పని చేస్తున్నారు. కంపెనీలు ఇప్పుడు ఉద్యోగుల వద్దకే వెళ్లేందుకు అడుగులు వేస్తున్నాయి. ఎక్కడి నుంచైనా పని చేసేందుకు ఉద్యోగులు రెడీగా ఉన్నారు.

ఇప్పుడే ఏపీకి మంచి సమయం

ఉద్యోగులు ఉన్న చోటే సంస్థలు ఏర్పాటు చేసేందుకు ఐటీ కంపెనీలు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ఏపీలో ఐటీ అభివృద్ధికి ఇదే సరైన సమయం. ఎందుకంటే దేశంలో అత్యధిక ఐటీ వర్క్‌ఫోర్స్ ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచంలో దాదాపు 20 శాతం ఐటీ ఉద్యోగులు ఏపీకి చెందినవారే ఉన్నారు. కాబట్టి ఏపీలోనే వర్క్‌ఫ్రమ్ హోమ్ చేస్తున్నవారు ఎక్కువగా ఉన్నారు. సింహభాగం ఐటీ పరిశ్రమలు ఇక్కడికి రావాల్సిందే. అదేవిధంగా ఏపీలో ప్రతి గ్రామానికి ఫైబర్ కనెక్టివిటీ ఏర్పాటు చేస్తూ డిజిటలైజేషన్‌కు శ్రీకారం చుట్టారు.

దేశంలోనే తొలిసారి విప్లవాత్మక నిర్ణయం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంజినీరింగ్ కరిక్యులమ్‌లో సమూల మార్పులు చేశారు. గతంలో కంపెనీలు ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్‌ని తీసుకొని ట్రైన్ చేసేవాళ్లు. సీఎం తీసుకున్న నిర్ణయంతో ఆ పరిస్థితులు ఇప్పుడు లేవు. ఇంజినీరింగ్ పట్టా తీసుకున్న ప్రతి ఒక్క విద్యార్థి పూర్తి నిష్ణాతుడిగా వస్తున్నాడు. ఇది ఐటీ సంస్థలకు గొప్ప వరం. ప్రభుత్వం ఐటీని ప్రమోట్ చేస్తున్న నేపథ్యంలో మానవ వనరులకు లోటు లేదు. కాబట్టి ఏపీలో ఐటీ పరిశ్రమల పెట్టుబడులకు కొంత సమయం పడుతుంది.